రైస్‌మిల్లు కార్మికుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా గణపవరంలో నాడు సాగించిన పోరాటం జిల్లాలో కార్మికోద్యమానికి ఒక నేతను అందించింది. ఆ పోరాటంలో రైస్‌మిల్లు డ్రైవర్‌గా పాల్గొన్న చింతకాయల బాబూరావు తర్వాత కాలంలో జిల్లాలో కార్మికోద్యమ విస్తరణకు కృషి చేసి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బాధ్యతలు నిర్విరామంగా నిర్వహించడం విశేషం. నిరంతర అధ్యయనంతో ప్రజా పోరాటాలపై దృష్టి సారించి సిపిఎం జిల్లా నేతగా ఎదిగారు. జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా వెనుదిరగని కామ్రేడ్ చింతకాయల బాబూరావు అక్టోబర్ 30న తీవ్ర అస్వస్థతకు గురై భౌతికంగా అందరికీ దూరమయ్యారు. ఆయన మరణానంతరం కూడా తన భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల పరీక్షల నిమిత్తం ఆశ్రం వైద్య కళాశాలకు అప్పగించడం అత్యంత గర్వకారణం. ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న కామ్రేడ్ చింతకాయల బాబూరావుకు అరుణాంజలి ఘటిస్తూ..

ప్రతి అక్షరం - ప్రజల పక్షం

ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

కామ్రేడ్ చింతకాయల బాబూరావు సంస్మరణ

ప్రత్యేక అనుబంధం



ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు

6 నవంబర్ 2025

8 పేజీలు

Advt.feature

రైసుమిల్లు డ్రైవర్ నుంచి..

కార్మిక, కమ్యూనిస్టు జిల్లా నేతగా

చింతకాయల బాబూరావు ఉద్యమ ప్రస్థానం



కార్మికోద్యమ నేత, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ చింతకాయల బాబూరావు తాడేపల్లిగూడెంలో జన్మించారు తాడేపల్లిగూడెంలో హైస్కూల్ చదువు, పెంటపాడులో డిగ్రీ చదివారు. తర్వాత రైస్‌మిల్లు డ్రైవర్‌గా నిడమర్రు మండలం భువనపల్లిలో పని చేయడం మొదలు పెట్టారు. 1981-82లో గణపవరం, భువనపల్లి రైస్‌మిల్లు కార్మికులు, యజమానుల వేధింపులు, చాలీచాలని వేతనాలు, కక్ష సాధింపు చర్యలకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో సాగిన వీరోచిత పోరాటంలో ఆయన భాగస్వాములయ్యారు. బ్రహ్మాండమైన సమ్మె కూడా జరిగింది. ఆ సమయంలో రైస్‌మిల్లు డ్రైవర్‌గా పని చేస్తున్న చింతకాయల బాబూరావు ఆ పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. బాబూరావు చురుకుదనం, సమరశీలత గమనించిన సిఐటియు నాయకత్వం ఆయనను ప్రోత్సహించి నాయకునిగా అభివృద్ధి చేశారు. రైస్‌మిల్లు డ్రైవర్ పని వదులుకుని ప్రజా ఉద్యమం కోసం, సిఐటియు కోసం పూర్తికాలం కార్యకర్తగా పని చేయడానికి సిద్ధపడ్డారు. గణపవరంలో అనేక మంది నాయకులున్న నేపథ్యంలో తాలూకా కేంద్రంగా ఉండి సిఐటియు బలహీనంగా ఉన్న తాడేపల్లిగూడెం ప్రాంతానికి వెళ్లి పని చేయాలని సిఐటియు, సిపిఎం జిల్లా కమిటీలు బాబూరావుకు సూచించాయి. దాన్ని అంగీకరించిన బాబూరావు తాడేపల్లిగూడెంలో కార్మికోద్యమ విస్తరణకు, సిఐటియును బలోపేతం చేసేందుకు ప్రయత్నం చేశారు. ఉల్లిపాయ మార్కెట్, రైల్వే గూడ్స్‌షెడ్, రైస్‌మిల్ కార్మికులు జట్లు జట్లుగా సిఐటియులో చేరారు. తాడేపల్లిగూడెం పట్టణంలో కార్మికుల సమస్యలతోపాటు ప్రజా సమస్యలపైనా కేంద్రీకరించి పని చేయడంతో సిపిఎం అభివృద్ధి చెందుతూ వచ్చింది. ఈ కృషిలో బాబూరావు పాత్ర చాలా ముఖ్యమైంది. సిపిఎం తాడేపల్లిగూడెం తాలూకా తొలి కార్యదర్శిగా పని చేశారు. బిఏ చదివిన బాబూరావు కార్మికుల, ప్రజా సమస్యలు, సిద్ధాంత రాజకీయాలు ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ అంచెలంచెలుగా అభివృద్ధి అయ్యారు. 1994లో తాడేపల్లిగూడెంలో జరిగిన సిఐటియు జిల్లా మహాసభలో ..2లో

నన్ను నాయకునిగా తయారు చేశారు

కర్రి నాగేశ్వరరావు,
సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు



ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కామ్రేడ్ బాబూరావు గారు నేను ఇంటర్ చదువుతున్నప్పుడు నన్ను విద్యార్థి సంఘానికి పరిచయం చేశారు. తర్వాత యువజన సంఘం డివైఎఫ్ఐ తాడేపల్లిగూడెం డివిజన్ బాధ్యతలు అప్పగించారు. 2004లో సిపిఎం పట్టణ కమిటీ బాధ్యతలు నాకు అప్పగిం చారు. 2004 నుండి పార్టీ, కార్మిక సంఘం తాడేపల్లిగూడెం డివిజన్ బాధ్యతలు అయన తరువాత నేను చూశాను. నన్ను ప్రారంభం నుండి నాయకునిగా తయారు చేశారు. నేను 1989లో ఉద్యమాలకు పరిచయమైనప్పటి నుంచి కామ్రేడ్ బాబూరావుగారి నాయకత్వంలో జరిగిన అన్ని ఉద్యమాల్లోనూ ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్నాను. కార్మిక నాయకునికి ఉండాల్సిన లక్షణాలు ఆయన నుండి నేర్చుకున్నవే. ఉద్యమాల సందర్భంగా పట్టువిడుపులు ఉండాలని చెప్పేవారు. తాడేపల్లిగూడెం పట్టణంలో మార్కెట్ హమాలీలు యూనియన్ ఏర్పాటు చేసుకున్న సందర్భంలో సిఐటియు యూనియన్ ఏర్పడకుండా యజమానులు కార్మికులపై అనేక ఒత్తిళ్లు తీసుకొచ్చి మొండివైఖరితో వ్యవహరించి కార్మికులను తొలగిస్తామని, వేతనాలు పెంచేది లేదని తెగేసి చెప్పిన సందర్భాల్లో సిఐటియు నాయకత్వంలో జరిగిన అనేక పోరాటాల్లో ఆయన ప్రత్యక్ష పాత్ర పోషించారు. తాడేపల్లిగూడెం పట్టణంలో కార్మికుల సమస్యపైనే కాకుండా వార్డుల్లోని ప్రజల సమస్యలపై పని చేయాలని ఆకాంక్షించేవారు. విద్యార్థి, యువజన, మహిళా సమస్యల పరిష్కారానికి నిరంతరం తపించేవారు. ఆయన నిరంతర అధ్యయనం చేస్తూ.. అధ్యయనం చేయండంటూ కార్యకర్తలను ప్రోత్సహించేవారు. సైద్ధాంతిక, రాజకీయ అంశాలను కార్యకర్తలకు వివరించేందుకు అమితాసక్తి చూపేవారు. అనేక రకాల పుస్తకాలు తీసుకొచ్చి లైబ్రరీ నిర్వహించారు. చాలాకాలం ప్రజాశక్తి విలేకరిగానూ పని చేశారు. తాడేపల్లిగూడెం పట్టణంలో కార్మికోద్యమంలో ఆయన పాత్ర చిరస్మరణీయం. ఆయన ఆకస్మిక మరణం తాడేపల్లిగూడెం పట్టణానికి, జిల్లా కార్మికోద్యమానికి, సిపిఎంకు తీరని లోటు. ఆయన చూపిన ఆశయాలను ముమ్ముందుకు తీసుకెళ్తామని ప్రతినబూనుతూ ఆయనకు ఘన నివాళులర్పిస్తున్నాను. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

ఆదర్శప్రాయులు చింతకాయల బాబూరావు

చింతకాయల బాబూరావు సహచరుడు
పచ్చిపులుసు గోవిందు



ప్రజాశక్తి - గణపవరం

సాధారణ రైసుమిల్లు కార్మికుడి నుంచి సిపిఎం జిల్లా నాయకుడిగా ఎదిగిన చింతకాయల బాబూరావు ప్రతిఒక్కరికీ ఆదర్శమని బాబూరావు సహచరుడు పచ్చిపులుసు గోవిందు చెప్పారు. గణపవరంలో కార్మిక ఉద్యమాల్లో ముందుండి పోరాడిన వ్యక్తి అని అన్నారు. మండలంలో కేశవవరం, అప్పారావుపేట, గణపవరం, రైతు వ్యవసాయ కార్మిక పోరాటాల్లో పాల్గొని వారికి అండగా ఉండేవాడని అని అన్నారు. ఆయన మృతి చాలా బాధాకరమని, ఉద్యమాలకు తీరని లోటని అన్నారు.

అసంఘటిత రంగ కార్మికులకు

అమలు కాని కార్మిక చట్టాలు



ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికుల జీవితాలు దుర్భరమవుతున్నాయి. కార్మిక చట్టాలు, పిఎఫ్, ఇఎస్ఐ వంటి కనీస సదుపాయాలు అమలు కావడం లేదు. చిల్లర వ్యాపార రంగంలో విదేశీ, స్వదేశీ కార్పొరేట్ శక్తులు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టడం వల్ల సాంప్రదాయకంగా ఉన్న వ్యాపారాలు దెబ్బతిని ఆ రంగాల మీద ఆధారపడి జీవిస్తున్న హమాలీలు, షాపుల్లో పనిచేసే గుమస్తా వగైరాలు ఉపాధి కోల్పోతున్నారు. ఇటీవల కాలంలో పట్టణాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు సాంకేతికతను ఉపయోగించుకుని నేరుగా వ్యాపారాలు నిర్వహించడంతో హమాలీ కార్మికుల ఉపాధి దెబ్బతింటుంది. ఉదాహరణకు తాడేపల్లిగూడెం మార్కెట్‌కు పండ్లు, అపరాలు, కూరగాయలు, ఉల్లిపాయలు, చింతపండు, ఎండుమిర్చి వగైరాలు ఇక్కడ దిగుమతి, ఎగుమతి కావడంతో వ్యాపారాలు లాభసాటిగా జరిగి హమాలీ కార్మికులకు పని ఉండేది. అయితే ప్రస్తుతం తాడేపల్లిగూడెం మార్కెట్‌కు రాకుండా ఇక్కడి నుంచి సరుకులు నేరుగా వెళ్లడంతో కార్మికులకు ఉపాధి లేకుండాపోయింది. పట్టణంలో షాపింగ్ మాల్స్‌లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదు. రూ.ఐదు వేల నుంచి రూ.పది వేల జీతంతోనే పది నుంచి 12 గంటల పాటు నిలబడి పని చేస్తున్నారు. ఎక్కువమంది యువతులతో పని చేయిస్తున్నారు. ఉదయం డ్యూటీకి హాజరైన దగ్గర నుంచి రాత్రి డ్యూటీ దిగేంతవరకు నిలువకాళ్లపై నిలబడి డ్యూటీలు చేస్తున్నారు. పని చేసే చోట బాత్రూమ్‌లు, రెస్ట్‌రూమ్‌లు వంటి సదుపాయాలు లేవు. ఇఎస్ఐ, పిఎఫ్, వారాంతపు సెలవులు అమలు కావడంలేదు. సంస్కరణ విధానాల ఫలితంగా కార్మిక శాఖకు దుకాణాల మీద అజమాయిషీ లేకపోవడంతో షాపింగ్ మాల్స్ 24 గంటలు, సెలవు రోజుల్లో సైతం తెరుచుకుని వ్యాపారాలు చేసుకునే విధానం వల్ల పర్యవేక్షణ లేకుండాపోయింది. పెరుగుతున్న ధరలకు తగ్గట్టుగా కనీస వేతనాలు అమల చేయకపోవడంతో పాతకాలపు వేతనాలతోనే కార్మికులు జీవించాల్సి వస్తుంది. పెట్రోలు, డీజిల్, గ్యాస్, ఇంటి అద్దెలు, కరెంట్ ఛార్జీలు విపరీతంగా పెరిగిపోవడంతో కార్మికులపై అదనపు భారం పడుతోంది. కరోనా వల్ల పరిశ్రమలు, సంస్థలు మూసివేయడంతో అసంఘటితరంగ కార్మికులు ఉపాధి కోల్పోయారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కోల్పోతున్న కార్మికులు పట్టణ ప్రాంతాలకు వలస రావడంతో కూలీల మధ్య పోటీ పెరిగి కనీస కూలి రేట్లను సాధించుకోలేకపోతున్నారు.

-కర్రి నాగేశ్వరరావు, తాడేపల్లిగూడెం

పాలకుల విధానాలతో

రైస్‌మిల్లు కార్మికుల జీవనం అస్తవ్యస్థం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 450 రైస్ మిల్లుల వరకూ ఉండేవి. ఈ రైస్‌మిల్లుల్లో 50 వేల మంది కార్మికులు పనిచేసేవారు. పశ్చిమగోదావరి జిల్లాలో ప్రధానంగా వ్యవసాయ రంగం ఉండడం వల్ల వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు విస్తృతంగా ఏర్పడ్డాయి. 1995 సరళీకృత ఆర్థిక విధానాలు ప్రారంభమైన తర్వాత రైస్‌మిల్లులు పాలకుల విధానాల ఫలితంగా తీవ్ర సంక్షోభంలోకి వచ్చాయి. రైస్‌మిల్లుల్లో ప్రధానంగా డ్రై బాయిలర్ సిస్టం మిల్లులు పూర్తిగా మూతబడి వేలాది మంది కార్మికులకు పని లేకుండా పోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు సరైన ప్రోత్సాహం ఇవ్వకపోవడంతో నిరాదరణకు గురవుతూ వచ్చాయి. నేడు పశ్చిమగోదావరి జిల్లాలో 200 రైస్‌మిల్లుల్లో పది వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా రైతులు ధాన్యం పంపించాలనే నిర్ణయం వల్ల రైస్‌మిల్లులు సరిగ్గా తిరగక కార్మికుల పని దినాలు తగ్గి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌బికె వల్ల అటు రైతులు, ఇటు కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు.

నూతన యంత్రాలు.. తగ్గుతున్న పని దినాలు

నూతన యంత్రాలు రావడం వల్ల కార్మికులు పని దినాలు కోల్పోతున్నారు. నూతన యంత్రాల వల్ల తక్కువ సమయంలో ఎక్కువ ఉత్పత్తి జరిగి యాజమాన్యాలకు లాభాలు వస్తున్నా కార్మికులకు పని భద్రత లేకుండా పోతోంది. పదిమంది చేసే పనిని నేడు ఒకరిద్దరితో చేయిస్తున్నారు. జట్టు, డ్రైవర్స్ కార్మికులు తగ్గి ఆదాయాలు కోల్పోతున్నారు.

కనీస వేతనాల చట్టం

కనీస వేతనాల చట్టాన్ని సవరించి అమలు చేయాల్సిన ప్రభుత్వం 15 సంవత్సరాలుగా ఆ పని చేయకుండా యాజమాన్యాలకు లాభాలు చేకూరుస్తూ



కార్మికులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. నేటికీ అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, కనీస వేతనాలు, గ్రాట్యూటీ వంటి కనీస చట్టాలు అమలు కావడం లేదు. లేబర్ అధికారులున్నా పట్టించుకోవడం లేదు. ఇఎస్ఐ, పిఎఫ్, కార్మిక శాఖాధికారులు యాజమాన్యాల నుంచి అందుతున్న ముడుపులు తీసుకొని పట్టించుకోవడం లేదు పైగా యాజమాన్యాలకు సలహాలిస్తూ పది మందిలోపు ఉండేలా రిజిస్ట్రేషన్ మార్పు చేస్తున్నారు. పై అధికారులకు తెలియజేసినా పట్టించుకునే నాధుడే లేడు. గట్టిగా అడిగితే (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) ప్రభుత్వ విధానమని అధికారులు చెబుతున్నారు.

సంఘాలు బలంగా ఉన్న ప్రాంతాల్లో రెండేళ్లకోసారి నూతన అగ్రిమెంట్లు జరుగుతున్నాయి. కొన్ని రైస్‌మిల్లుల్లో పిఎఫ్, ఇఎస్ఐ గ్రాట్యూటీ అమలవుతున్నాయి. కార్మికులు ఐక్యంగా ఉన్నచోట కొన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయించుకుంటున్నారు. సంఘాలు లేనిచోట నేటికీ పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటీ లేకుండా యాజమాన్యాలపై ఆధారపడి పని చేస్తున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి వలస కార్మికులు రైస్‌మిల్లు రంగంలో ప్రవేశించారు. వారికి కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటీ వంటివేమీ అమలు కావడం లేదు. దీని ఫలితంగా సంఘాలు బలంగా ఉన్న చోట సాధించుకున్న హక్కులు కుదించడానికి రైస్‌మిల్లు యాజమాన్యాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. పోటీ కార్మికులను తీసుకురావడం వల్ల వారితో పోలుస్తూ మీరు కూడా రేట్లు తగ్గించుకోవాలని కార్మికుల దగ్గర డిమాండ్లు పెరిగాయి. సంఘం బలంగా ఉన్న చోట ఐక్యంగా రేట్లు నిలబెట్టుకున్నారు. ఎక్కువ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా తక్కువ రేట్లకు పనిచేస్తూ తీవ్రంగా నష్టపోతున్నారు. వలస కార్మికులకూ చట్టప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తోంది. మైగ్రేషన్ చట్ట ప్రకారం ఇతర రాష్ట్ర కార్మికులతో పని చేయించాలంటే యాజమాన్యాలకు లైసెన్స్ ఉండాలి. అలా కాకుండా యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఇతర రాష్ట్రాల కార్మికులను పనుల్లో పెడుతున్నా అధికారులు స్పందించడం లేదు. ఇటీవల ప్రమాదాలు జరుగుతుంటే పరిశ్రమల్లో ఎక్కువ శాతం మంది ఇతర రాష్ట్రాల కార్మికులు చనిపోతున్నారు. అయినా పట్టించుకునే నాథుడే లేడు. స్థానిక కార్మికులకు పని భద్రత, కార్మిక చట్టాలు అమలు చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైస్‌మిల్లు రంగంపై చర్చించనుంది. భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేయనుంది.

- బి.వాసుదేవరావు, భీమవరం

రైస్‌మిల్లు డ్రైవర్ నుంచి..
కార్మిక, కమ్యూనిస్టు జిల్లా నేతగా..

(మొదటి పేజీ నుంచి)

జిల్లా అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. 2015 వరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బాధ్యతల్లో ఏదోకటి ఉంటూ జిల్లా కార్మికోద్యమాల నిర్మాణం, పోరాటాల్లో ముఖ్యమైన పాత్ర వహించారు. 1991 నుండి సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులుగా, 1994లో అఖిల భారత కౌన్సిల్ సభ్యులుగా పని చేశారు. తాడేపల్లిగూడెం ఫుట్‌ప్యాట్స్ పరిశ్రమ, హమాలీలు, మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి అజరామం. తణుకులో సిటీ బస్సులు, అనంతలక్ష్మి మిల్లు పోరాటంలో, ఉమ్మడి జిల్లాలో భీమవరం, ఆకివీడు, తణుకు, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరుల్లో రైస్‌మిల్లు కార్మికుల పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొని సిఐటియు విస్తరణలో ప్రధాన పాత్ర వహించారు. జిల్లాలో సంఘటిత రంగంలో, పరిశ్రమల్లో సంఘాల నిర్మాణానికి కృషి చేశారు. స్కీమ్ ఉద్యోగులు అంగన్వాడీ, ఆశా, మిడ్‌డే మీల్స్, ఐకెపి సంఘాల నిర్మాణంలో, వారి ఆందోళన, పోరాటాల్లో నిరంతరం పాల్గొనేవారు. భవన నిర్మాణ కార్మికుల సంఘ నిర్మాణంలో ప్రత్యక్ష పాత్ర పోషించారు. జిల్లా కార్మిక ఉద్యమ నిర్మాత అల్లూరు సత్యనారాయణ నిరంతర సలహాలు, సూచనలతో జిల్లాలో కార్మిక నేతగా ఎదిగారు. అల్లూరు, ఆర్ఎస్ నేతృత్వంలో జిల్లాలో కార్మికోద్యమ విస్తరణలో, సిపిఎం అభివృద్ధిలో ఒక ముఖ్యమైన పాత్ర బాబూరావుది. సిఐటియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా 35 సంవత్సరాలపాటు పని చేశారు. ప్రతిపాడులో రైస్‌మిల్లు కార్మికుల ఉద్యమం సందర్భంగా పోలీసులు కాల్పులకు తెగబడినా ఎదురొడ్డి కార్మికులను సంఘటితంగా నిలబెట్టారు. ఈ క్రమంలో పోలీసులు ఆయనను అరెస్టు చేసి జైలుకు పంపినా వెనుకడుగు వేయలేదు. రైస్‌మిల్లు కార్మికుల, హోమాలీల ఆందోళన, పోరాటాల సందర్భంగా నిర్బంధం, కేసులను ఎదుర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో ఇప్పుడున్న అనేక సంఘాల ఏర్పాటు, అభివృద్ధిలో, సిపిఎం అభివృద్ధిలో బాబూరావు పాత్ర కీలకం. అనేకమంది కార్యకర్తలను అభివృద్ధి చేయడంలో మంచి పాత్ర వహించారు. సిఐటియు, సిపిఎం జిల్లా నాయకత్వం సూచన మేరకు బాబూరావు తాడేపల్లిగూడెం నుండి జిల్లా కేంద్రమైన ఏలూరు మకాం మార్చి, జిల్లావ్యాప్త పోరాటాలు, ఉద్యమాలకు నాయకునిగా పని చేశారు. సిపిఎం తాడేపల్లిగూడెం తాలూకా కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా, జిల్లాల విభజన అనంతరం ఏలూరు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. జిల్లాల పునర్విభజన అనంతరం భీమవరం కేంద్రంగా పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా పని చేస్తున్నారు. సిఐటియు సీనియర్ నాయకులుగా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులుగా పని చేస్తున్నారు. చొరవైన మనిషిగా, కార్మికులను, ప్రజలను ఆకట్టుకునే మాటకారిగా కార్మిక, కుటుంబ సంబంధాల అభివృద్ధిలో బాబూరావు పేరొందారు.

కార్మిక హక్కుల సాధన పోరాట యోధుడు

మాజీ ఎంఎల్ఎ ఈలి వెంకట మధుసూదనరావు (నాని)



కార్మిక హక్కుల సాధన పోరాట యోధుడు, నిరంతరం కార్మిక, కర్షక, శ్రామిక హక్కుల పరిరక్షణకు అలుపెరుగని పోరాటం చేసిన పోరాట యోధుడు నా సోదరుడు చింతకాయల బాబూరావు. బాబూరావు తండ్రి కీర్తిశేషులు చింతకాయల కొండలరావు, మా తండ్రి కీర్తిశేషులు ఈలి ఆంజనేయులు మున్సిపల్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఆ కౌన్సిల్‌లో మున్సిపల్ కౌన్సిలర్‌గా మా నాన్నగారికి అత్యంత సన్నిహితుడిగా కలిసిమెలిసి ఉండేవారు. మా రెండు కుటుంబాలు చాలా సాన్నిహిత్యంగా ఉండేవి. నేను, సోదరుడు బాబూరావు పెంటపాడు డిఆర్ గోయెంకా ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ కలిసి చదువుకున్నాం. కాలేజీలో బాబూరావు, నేను చాలా మంచి స్నేహంతో, సోదరుల్లా కలిసి మెలిసి ఉండేవాళ్లం. ఇంటర్ పూర్తయిన వెంటనే మా తండ్రి యీలి ఆంజనేయులు బాబూరావు తండ్రితో ఉన్న సాన్నిహిత్యం కారణంగా బాదంపూడి రోడ్డులోని ముత్యాలమ్మ అమ్మవారి గుడి దగ్గర ఉన్న మా రైస్ మిల్లు రాజరాజేశ్వరి రైస్ మిల్లులో సోదరుడు బాబూరావుకి ఉద్యోగ బాధ్యతలు అప్పగించారు. రైస్ మిల్లులో నేను, సోదరుడు బాబూరావు బాలా సరదాగా గడిపేవారం. ఆతర్వాత బాబూరావు గణపవరం వెళ్లి అక్కడ పనిచేశాడు. బాబూరావు రైస్ మిల్లు దగ్గర పనిచేసేటప్పటి నుండే కార్మికుల సమస్యలపై అవగాహన పెంపొందించుకుని, తర్వాత అంచెలంచెలుగా, కార్మిక నాయకునిగా, సిపిఎం నాయకునిగా, కార్మిక కర్షక శ్రామిక వర్గాల న్యాయపరమైన హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన పోరాట యోధుడు. మంచి మిత్రుడు, కార్మిక హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేసిన కార్యసాధకుడు మన మధ్య లేకుండా వెళ్లిపోయారు. మిత్రుడు బాబూరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.



కార్మికోద్యమ విస్తరణకు బాబూరావు విశేష కృషి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

గణపవరంలో 1981లో రైస్‌మిల్లు కార్మికోద్యమం ప్రారంభించాం. కార్మికులు విజయం సాధించారు. ఆ మరుసటి సంవత్సరం 1982లో రైస్‌మిల్లు డ్రైవర్ల యూనియన్‌లో కలిశారు. అప్పుడే బాబూరావుతో నాకు తొలి పరిచయం. బాబూరావు రైస్‌మిల్లు డ్రైవర్‌గా పని చేసేవారు. వయసు 20 ఏళ్లు ఉంటుంది. కార్మిక సంఘ కార్యకలాపాలకే కాకుండా యువకునిగా యువజన సంఘంలో బాధ్యత తీసుకొని పని చేయాలని ప్రతిపాదిస్తే వెంటనే అంగీకరించి బాధ్యత తీసుకున్నారు. పార్టీ సభ్యుడయ్యారు. తర్వాత తాను పూర్తికాలం కార్యకర్తగా పని చేస్తానని ముందుకొచ్చారు. తాడేపల్లిగూడెంలో కార్మికోద్యమ విస్తరణకు పార్టీ పంపించింది. అప్పటి నుంచి పార్టీ, టియు రంగం ఇచ్చిన శిక్షణతో అంచెలంచెలుగా జిల్లా కార్మికవర్గ నేతగా, సిపిఎం నేతగా ఎదిగారు. తాడేపల్లిగూడెం తాలూకాలో పార్టీ, కార్మిక ఉద్యమాల విస్తరణకు చురుకైన పాత్ర వహించారు. జిల్లావ్యాప్త ఉద్యమాలకు దీర్ఘకా లం నాయకత్వం వహించారు. స్వయం సాధన, పట్టుదలతో సిద్ధాంత, రాజకీయ అంశాలను అధ్యయనం చేసి స్థాయిని పెంచుకు న్నారు. 43 ఏళ్ల కార్మిక కమ్యూనిస్టు ఉద్యమాల్లో అంచెంచల విశ్వాసం, సైద్ధాంతిక, రాజకీయ నిబద్ధతతో 1980 తరువాత జిల్లా నూతన తరం నాయకుల్లో ఒకరుగా అభివృద్ధి చెందారు. ఆయన పాత్ర చిరస్మరణీయం, ఆయన జీవితం ధన్యం.

మట్టిలో మాణిక్యం కామ్రేడ్ బాబూరావు

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం



కార్మికోద్యమ నేత చింతకాయల బాబూరావు ఆకస్మిక మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. పార్టీ, కార్మిక శ్రేణులు నిర్ఘాంతపోయాయి. సాధారణ రైస్‌మిల్లు కార్మికునిగా జీవితాన్ని ప్రారం భించి రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ మండల, తాలూ కా జిల్లా నాయకులుగా ఎదగడమే కాక, కార్మిక రంగ జిల్లా కీలక బాధ్యతలైన సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బాధ్యతలు స్వీకరించి సుదీర్ఘ కాలం సమర్థవంతంగా నిర్వహించారు. రైస్‌మిల్ కార్మి కుల పోరాటం లోనూ, అగ్రిమెంట్‌లోనూ ముఖ్య భూమిక పోషించారు. తాడేపల్లిగూడెం బజారు హమాలీల సంఘం నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషించారు. కార్మిక నాయకునిగా ఎదగడమేకాక కార్మిక వర్గానికి నిత్యం అండగా ఉన్న సిపిఎంలోను సాధారణ సభ్యుని స్థాయి నుండి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యునిగా పని చేశారు. తాను మరణించే వరకూ తనకు అప్పగిం చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. వ్యక్తిగత జీవితంలోను తీవ్ర కష్టనష్టాలను చవిచూశారు. తత్ఫలితంగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. అయినా ఏనాడూ కార్మిక, ప్రజా సమస్యలపై పోరాడటంతో వెనుదిరగలేదు. తన భార్యను ఉపాధ్యాయ నేతగా ప్రోత్సహించారు. ఆరేళ్ల క్రితం అత్యంత సంక్లిష్టంగా బైపాస్ సర్జరీ జరిగినా పనిలో యువకులతో పోటీపడ్డారు. నిత్యం కొత్త విషయాలు తెలుసుకోవాలి, తెలిసింది ఇతరులకు చెప్పాలని తాపత్రయపడేవారు. వ్యక్తిగత కష్టాలు, నష్టాలు, ఆరోగ్య సమస్యలు ఎన్ని ఉన్నా ప్రజల కోసం ఎలా చిరునవ్వుతో పని చేయొచ్చనేది బాబూరావు అనుసరించి చూపించారు. అందరికీ స్ఫూర్తిదాయకం.. మట్టిలో మాణిక్యం కామ్రేడ్ బాబూరావు జీవితం. ఆయన భార్య, కుమారుడికి ప్రగాఢ సాను భూతి తెలియజేస్తున్నాను. ఆయన మరణం కార్మికోద్యమానికి, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు. కామ్రేడ్ బాబూరావుకు విప్లవ జోహార్లు అర్పిస్తున్నాను.

ఉద్యమంలో బాబూరావు ముఖ్యపాత్ర

కె.రాజారామ్మోహన్‌రాయ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి




ప్రజాశక్తి - భీమవరం

సిఐటియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉద్యమంలో ఒక ముఖ్యపాత్ర వహించిన కార్మిక నేత కామ్రేడ్ చింతకాయల బాబూరావు. సాధారణ రైస్‌మిల్ కార్మికునిగా పని చేస్తూ జిల్లాలోని అసంఘటిత, సంఘటిత రంగ కార్మికులు, స్కీమ్ ఉద్యోగుల ఆందోళనలు పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన నాయకుడు. తాడేపల్లిగూడెం ప్రాంత ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని నిర్మించడంలో ప్రధాన పాత్ర వహించిన వ్యక్తి. 1993 నుండి ఆయనతో సిఐటియు ఉద్యమ నిర్మాణం, విస్తరణలో ప్రత్యక్షంగా కలిసి పని చేశాను. 20 సంవత్సరాలపాటు మేమిద్దరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఏదోక బాధ్యతలో ఉంటూ పని చేశాం. 1993లో కామ్రేడ్ కొల్లా వెంకటరత్నం మరణానంతరం జిల్లా అధ్యక్షులుగా బాధ్యతల్లోకి వచ్చిన బాబూరావు, అప్పుడే చదువుకుని టియు ఉద్యమంలోకి ప్రవేశించిన నేను.. కామ్రేడ్ అల్లూరి, ఆర్ఎస్‌ల నేతృత్వంలో పని చేస్తూ బాబురావుతో కలిసి ప్రత్యక్షంగా పాల్గొంటూ జిల్లా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో మెళకువలు నేర్చుకున్నాను. జిల్లాలో బలంగా ఉన్న రైస్‌మిల్ బజార్ జట్లు యూనియన్ నిర్మాణంలో ఆయన బాధ్యత వహిస్తూ, సంఘటిత.. స్కీమ్ ఉద్యోగుల సంఘాల నిర్మాణంలో నేను బాధ్యత వహిస్తూ ప్రతి విషయాన్ని చర్చించుకునేవాళ్లం. జిల్లాలో సిఐటియు ఉద్యమాన్ని విస్తరించడంలో ఆయన పాత్ర ముఖ్యమైంది. కుటుంబంలో తీవ్ర ఇబ్బందులు వచ్చినా మొక్కవోని దీక్షతో టియు ఉద్యమానికి ఆటంకం రాకుండా కృషి చేశారు. భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, ఆకివీడు రైస్‌మిల్ కార్మికుల వేతన ఒప్పందాల్లో చురుకైన పాత్ర వహిస్తూ ఆ రంగాన్ని నిరంతరం అధ్యయనం చేస్తూ ఎత్తుగడలు రూపొందించడంలోనూ, కార్మికులను నిలబెట్టడంలోనూ మంచి పాత్ర పోషించేవారు. తణుకు పట్టణంలో సిటీ బస్సులు, కోస్టల్ ఆగ్రో, అనంతలక్ష్మి, వానబ్రీ యూనియన్ల ఏర్పాటు సందర్భంగా జరిగిన పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటూ చురుకైన పాత్ర వహించారు. జిల్లాలో భవన నిర్మాణం మున్సిపల్ రంగాల్లో విస్తరించేందుకు మంచి కృషి చేశారు. జిల్లా సభ్యత్వాన్ని పెంచాలని సంఘాల నిర్మాణం చేయాలని నిరంతరం ఆలోచించేవారు. వివిధ పత్రికల్లో వచ్చిన వ్యాసాలు, కోర్టు తీర్పులు, కార్మిక లోకం పత్రికలో వస్తున్న అనేక అంశాల్ని భద్రపరచడానికి నిరంతరం ప్రయత్నించేవారు. రెండు సంవత్సరాల నుంచి అనారోగ్యంగా ఉన్నా రైతురంగం బాధ్యత చూస్తూ జిల్లాలో టియు ఉద్యమం ఎలా విస్తరించాలి, వస్తున్న ఇబ్బందులు, మంచి చెడులను తరచూ చర్చించేవారు. 1983లో పాలకొల్లులో కామ్రేడ్ అల్లూరి ఎన్నికల ప్రచారంలో పరిచయమైన బాబూరావు మరణించే వరకు ఉద్యమంలో సహచరుడిగా.. సోదరుడిగా పని చేయడం అనేక స్మృతులను జ్ఞాపకాలను, అనుభవాలను మిగిల్చింది. కామ్రేడ్ బాబూరావుకు విప్లవ జోహార్లు అర్పిస్తున్నాను.

కార్మికుల ఆశాజ్యోతి చింతకాయల బాబూరావు

ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్



ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం పట్టణంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేసిన పోరాట యోధుడు, కార్మికుల ఆశాజ్యోతి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు. ఆయన మరణం కార్మిక లోకానికి తీరని లోటు. కార్మికుల సమస్యలపైనే కాకుండా పట్టణంలోని అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి బాబూరావు అంకితభావంతో కృషి చేశారు. పోరాటాలు సాగించారు. ప్రజా సమస్యలపై పోరాటాలకు ఆయన స్ఫూర్తిదాయకులు. అనేక సంవత్సరాలుగా బాబూరావుతో నాకు సహవాసం ఉంది. తాడేపల్లిగూడెంలో వ్యాపారస్తులకుగాని, కార్మికులకుగాని ఏ సమస్య వచ్చినా ఆయన ముందుండి సమస్య పరిష్కారానికి కృషి చేసేవారు. ఆయన మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. బాబూరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

ఉపాధ్యాయ ఉద్యమానికి సహకరించారు

పిడిఎఫ్ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి




ప్రజాశక్తి - భీమవరం

కార్మికోద్యమ నేత చింతకాయల బాబూరావు మృతి కార్మిక, ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటు. సిఐటియు నేతగా ఆయన పని చేస్తున్న సమయంలో ప్రతి ఉపాధ్యాయ ఉద్యమానికి సహకరించేవారు. తాడేపల్లిగూడెంలో యుటిఎఫ్ నాయకత్వానికి సూచనలు, సలహాలు అందించి ఉద్యమాలు సాగించేలా ప్రోత్సహించేవారు. బాబూరావు కార్మిక నేతగా ఉంటూనే, భార్య శ్రీదేవిని తనతోపాటు సమానంగా కార్మిక, ఉపాధ్యాయ ఉద్యమంలో పాల్గొనేలా ప్రోత్సహించడం అభినందనీయం. ప్రస్తుతం ఆమె యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతల్లో పని చేస్తూ సమస్యల పరిష్కారానికి నిర్విరామంగా కృషి చేస్తున్నారు. తనతో ఉన్న పరిచయస్తులను వామపక్ష భావజాలం వైపు మళ్లించేందుకు కృషి చేసేవారు. పేద, కార్మిక వర్గాల సమస్యల పరిష్కారానికి తన జీవితం మొత్తం అంకితం చేశారు. ఆయన మన మధ్య లేకపోవడం కార్మిక, ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటు. బాబూరావు ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఘనమైన నివాళులు అర్పించినట్లు. ఆ దిశగా అందరంగా సమిష్టిగా కృషి చేద్దాం.

ఎర్రజెండాను కడవరకూ మోసిన బాబూరావు

ఎ.రవి, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి



పాలకవర్గ పార్టీల్లో నాయకులు డబ్బు, పలుకుబడి, సామాజిక తరగతి, కుటుంబ నేపథ్యంలో రాత్రికి రాత్రే నేతలవుతారు. కమ్యూనిస్టు పార్టీలు ఇందుకు పూర్తిగా భిన్నం. ప్రజా ఉద్యమాల నుంచో, సైద్ధాంతిక భావజాలం నుంచో, పునాది వర్గాల నుంచో తయారవుతారు. అందుకు చింతకాయల బాబూరావు జీవితమే ప్రత్యక్ష ఉదాహరణ. ఓ సాధారణ రైసుమిల్లు కార్మికునిగా పోరాటాల్లో సిఐటియు, సిపిఎంలోనూ కార్యకర్తగా ప్రారంభమైన ఆయన ఉద్యమ జీవితం సంఘంలోనూ, పార్టీలోనూ జిల్లాస్థాయి నాయకునిగా సాగింది.

సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎదిగారు. సిపిఎం తాడేపల్లిగూడెం డివిజన్ కార్యదర్శిగా, అప్‌ల్యాండ్, ఏలూరు జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యునిగా పలు ఉన్నత బాధ్యతలు నిర్వర్తించారు. కామ్రేడ్ బాబూరావు నాకు పాలకొల్లు ప్రాంతంలో పని చేసేటప్పుడే పరిచయమయ్యారు. ప్రత్యేకించి ఆచంట నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై ఒక పాదయాత్ర దళ నాయకునిగా వ్యవహరించారు. అప్పుడే నేను యలమించిలి మండల కార్యదర్శిగా బాధ్యతల్లో ఉన్నాను. ఆ యాత్ర నాయకునిగా బాబూరావు సమర్ధవంతంగా నిర్వహించారు. తర్వాత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కేంద్రం బాధ్యతల్లోకి వచ్చాక పలు విషయాల్లో కలిసి పని చేశాం.

పార్టీ నిర్మాణ సౌలభ్యం కోసం పశ్చిమగోదావరి జిల్లాను డెల్టా, అప్‌ల్యాండ్ కమిటీలుగా విభజించింది. నేను పోలవరం డివిజన్ కార్యదర్శిగా అనంతరం జిల్లా కేంద్రం నుంచి ఆ ప్రాంతాన్ని చూడడంతో అప్‌ల్యాండ్ కమిటీలో కొనసాగాను. బాబూరావు అప్‌ల్యాండ్ జిల్లా కార్యదర్శిగానూ, అనంతరం కొంతకాలం పాటు ఏలూరు జిల్లా కార్యదర్శిగానూ కొనసాగారు. ఈ జిల్లాలో ఆయనతో కలిసి పలు ఉద్యమాలతో పాటు కరోనా కాలంలో సేవా కార్యక్రమాలు, ఐసోలేషన్ కేంద్రాల నిర్వహణలో పని చేశాం. ఈ కాలంలోనే ఆయన తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఓపక్క తీవ్ర అనారోగ్యం, మరోపక్క కుటుంబంలో ఇబ్బందులు రెండింటినీ దిగమింగి మొక్కవోని దీక్షతో తన బాధ్యతలు నిర్వహించారు. చివరి వరకూ నిరంతరం ప్రజాఉద్యమాల్లో శక్తికి మించి బాధ్యతలు నిర్వహించారు. చివరికి మరణానంతం కూడా వైద్య విద్యార్థుల అధ్యయనానికి ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు ఏలూరు ఆశ్రం వైద్య కళాశాలకు అందించడం ఆయన ఆశయాలు, లక్ష్యాలకు కొనసాగింపు కావడం ద్వారా జీవితంలోనూ, మరణంలోనూ ఎర్రజెండాను ఎగురవేశారు.

అనారోగ్యంగా ఉన్నా.. ఆశయం వీడలేదు

ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి), పిడిఎఫ్ మాజీ ఎంఎల్‌సి



కామ్రేడ్ బాబూరావు ఒక రైస్‌మిల్లు డ్రైవర్‌గా, కార్మికోద్యమానికి పరిచయమై, సిఐటియు నేతగా ఎదగడం ఆయన కృషికి నిదర్శనం. సిఐటియు, సిపిఎం జిల్లా నేతగా ఎదిగి అనేక ప్రజా ఉద్యమాలకు సహకరించడం, ప్రత్యక్షంగా పాల్గొనడం ఆయనకు చెలింది. కార్మికుల, శ్రమజీవుల ఉద్యమాల నేతగా పేరొందారు. అనారోగ్యానికి గురైనా ఆశయాన్ని వదులుకోకపోవడం బాబూరావు ఘనత. తన జీవిత భాగస్వామి శ్రీదేవి ఉపాధ్యాయురాలిగా ఉపాధ్యాయ ఉద్యమానికి సహకరించేలా ప్రోత్సహించారు. ప్రజాతంత్ర ఉద్యమంలో తుదిశ్వాస విడిచే వరకూ పని చేసిన కామ్రేడ్ బాబూరావుకు విప్లవ జోహార్లు అర్పిస్తున్నాను. భార్య శ్రీదేవి, కుమారుడు సిద్ధార్థకు, ఉద్యమ శ్రేయోభిలాషులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

బాబూరావు ఉద్యమ ప్రస్థానం..



ప్రజాశక్తి పత్రిక చదువుతూ..


కామ్రేడ్ ఆర్ఎస్‌కు బాబూరావు పరామర్శ






కామ్రేడ్ ఆర్ఎస్‌తో బాబూరావు దంపతులు




జీవిత భాగస్వామి శ్రీదేవితో బాబూరావు


సహచరుడు, మాజీ ఎంఎల్ఎ ఈలి నానితో బాబూరావు


సిపిఎం అగ్రనేతలతో బాబూరావు


మంతెన సీతారాం, గోవింద్‌తో బాబూరావు



ప్రదర్శనలో నినదిస్తున్న బాబూరావు



బొలిశెట్టి శ్రీనివాస్ ఎన్నికల ప్రచారంలో..


పిడిఎఫ్ మాజీ ఎంఎల్‌సి ఐవితో బాబూరావు



అప్పటి కలెక్టర్‌కు వినతి అందిస్తూ..


అంగన్‌వాడీల ధర్నాకు సంఘీభావం


వర్షానికి నీటమునిగిన పంటను పరిశీలిస్తున్న బాబూరావు


బాబూరావుకు మాజీ ఎంపీ మధు పరామర్శ



బహిరంగ సభలో మాట్లాడుతున్న బాబూరావు


సిఐటియు పతాకావిష్కరణ..



మార్క్స్ శతజయంతి సభలో..


కలెక్టరేట్ వద్ద ధర్నాలో..


మాజీ ఎంపీ మిడియం బాబూరావుతో కలిసి..


2010లో చండీఘర్‌లో జరిగిన సిఐటియు అఖిల భారత మహాసభకు హాజరైన జిల్లా ప్రతినిధులు


అల్లూరు, రాయ్‌తో కలిసి బాబూరావు



సమావేశంలో మాట్లాడుతున్న చింతకాయల బాబూరావు



యాత్రను ప్రారంభిస్తున్న చింతకాయల బాబూరావు

సమరశీల పోరాటాల రథసారధి.. సిఐటియు

భారత కార్మికోద్యమం స్వాతంత్ర్య పోరాటంలో ఆవిర్భవించింది. దేశంలోని యావత్ కార్మిక వర్గాన్ని స్వాతంత్ర్య పోరాటంలోకి దించింది. బాలగంగాధర్ తిలక్‌కు బ్రిటిష్ పాలకులు మూడు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తే మూడు రోజుల పాటు ముంబాయి కార్మికవర్గం సమ్మెకు దిగి నిరసన తెలిపింది. శ్రామిక రాజ్యం రాకుండా భారత పాలకులు బ్రిటిష్ పాలకులతో రాజీ పడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కార్మికోద్యమాన్ని చీల్చడానికి పూనుకున్నారు. ఐఎన్‌టియుసిని ఏర్పాటు చేసి కార్మికవర్గాన్ని చీల్చారు. ఇదే సమయంలో ఎఐటియుసి డాంగే నాయకత్వంలో నెహ్రూ ప్రభుత్వానికి అండగా నిలబడింది. రెండు స్తంభాల సిద్ధాంతాన్ని ప్రచారం చేసింది. వర్గపోరాట సిద్ధాంతాలకు తూట్లు పొడిచి వర్గ సామరస్య సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చింది. నెహ్రూ ప్రభుత్వం సోషలిస్ట్ విధానాలు అనుసరిస్తున్నారని ఆయన్ని బలపరిచారు. "బోనస్ పోయినా పర్వాలేదు ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ మేలు" అనే స్థాయి వరకూ వారి విధానాలు దిగజారాయి. వర్గపోరాట పద్ధతులకు తిలోదకాలిచ్చారు. ఈ చారిత్రక నేపథ్యంలో 1970లో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) ఆవిర్భవించింది.

సిఐటియు అన్ని రంగాల కార్మికులకు కలిపి ఏర్పడిన సంస్థ. దేశంలో ఒకే కార్మిక సంఘం ఏర్పడిందని కమ్యూనిస్టు నేత బిటి.రణదివే (అఖిలభారత సిఐటియు అధ్యక్షులు) ఇచ్చిన పిలుపు వర్గ పోరాట సిద్ధాంతాన్ని నిలబెట్టడానికి ఏర్పడిన ఏకైక సంస్థగా అప్పటికీ, ఇప్పటికీ సిఐటియు పనిచేస్తోంది. ప్రారంభంలోనే కార్మికవర్గం సమైక్యం కావాలని దేశవ్యాప్తంగా వారం రోజులు కార్యక్రమానికి పిలుపునిచ్చారు. కార్మిక వర్గ ఐక్యతలో భాగంగా దేశంలో బలమైన నాటి రైల్వే కార్మిక సంఘాలను ఒక తాటిపైకి తీసుకురావడంలో సిఐటియు కృషి చేసింది. 1972లో ఎల్ఆర్ఎస్ఎ (రైల్వే) యూనియన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన రైల్వే సమ్మె 1974లో 18 లక్షల మంది రైల్వే కార్మికులు దేశవ్యాప్తంగా సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మెను ఆలిండియా రైల్వే వర్కర్స్ కో-ఆర్డినేషన్ కమిటీ నడిపించడంలో సిఐటియు నాయకులు, పార్లమెంట్‌లో సిపిఎం పక్ష నాయకులైన సమర్ ముఖర్జీ పాత్ర కీలకమైంది. 80 రైల్వే యూనియన్లను ఒకే తాటిపైకి తెచ్చారు. జార్జ్ పెర్నాండస్ కన్వీనర్‌గా ఉన్నారు. 18 రోజులు సమ్మె దేశవ్యాప్తంగా రవాణాను కుదిపేసింది. రైల్వే జోన్, డివిజన్ వారీగా సమ్మె విరమించే నిర్ణయాలు తీసుకోవాలని డాంగే ఇచ్చిన పిలుపు సమ్మె విచ్ఛిన్నానికి దారితీసింది. రైల్వే కార్మికుల సమ్మె విచ్ఛిన్నమైంది. అయినా చారిత్రక పోరాటంగా నిలిచింది. ఏనాటికైనా రైల్వేతో సహా అన్ని రంగాల కార్మికులు ఐక్య పోరాటాల ద్వారానే వర్గ పోరాటం సాధ్యమవుతుంది. దానికి సిద్ధం చేయడమే నేటి కార్మిక సంఘాల ప్రధాన కర్తవ్యం. ఈ కృషిలో నేటికీ ఆవిరళ కృషి సిఐటియు సాగిస్తుంది. 1982లో కార్మిక చట్టాలను మార్చాలని పాలకుల ప్రయత్నాలను కార్మికవర్గం తిప్పికొట్టింది.


బిటి.రణదివే


పి.రామ్మూర్తి


సమర్ ముఖర్జీ

1991లో పివి.నరసింహారావు, మన్మోహన్ సింగ్ సారధ్యంలో సరళీకరణ విధానాలు ప్రారంభమయ్యాయి. ఈ విధానాలపై ఇతర సంఘాలు ఆనాడు ఊగిసలాడాయి. సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రారంభం నుండి నికరంగా పోరాడుతున్న సంఘం సిఐటియు. నేడు అత్యధిక సంఘాలు ప్రయివేటీకరణ, సరళీకరణ విధానాలను వ్యతిరేకిస్తున్నట్లు మాట్లాడుతున్నాయి, కానీ ఆచరణలో అర్ధమనస్సుతో పనిచేస్తున్నాయి. ఆరంభం నుండి అన్ని సంఘాలు సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి ఉంటే నేడు ఈ పరిస్థితి ఉండేది కాదు. 1985 రాజీవ్ గాంధీ విదేశీ దిగుమతి సరళీకరణ విధానం ప్రవేశపెట్టారు. మనదేశంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు కంటే విదేశాల నుండి సరుకులు చౌకగా దిగుమతి తీసుకోవడం దేశానికి లాభకరం అని ఉద్బోధించారు. జర్మనీకి సంబంధించిన సీమేన్ కంపెనీలను ప్రోత్సహించారు. దీనిపై పి.రామ్మూర్తి సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీమేన్‌కు వ్యతిరేకంగా పార్లమెంటులోనూ, బయటా పోరాడారు. స్వాతంత్ర్యం అనంతరం కార్మిక హక్కుల కోసం జరిగిన పోరాటాలు ఫలితంగా అనేక కార్మిక సంక్షేమ చట్టాలు వచ్చాయి. ప్రావిడెంట్ ఫండ్, గ్రాడ్యూటీ, ఇఎస్ఐ, మెటర్నిటీ (ప్రసూతి) వంటి అనేక చట్టాలు సాధించడంలో కార్మిక వర్గ పోరాటాలు కీలకమయ్యాయి.

బిజెపి మొదటి ప్రభుత్వం వాజ్‌పేయి సారధ్యంలో ప్రయివేటీకరణ విధానాలను ఉధృతం చేసింది. హిందుస్థాన్ జింక్‌ను స్టెరలైడ్ ప్రయివేటు సంస్థకు అమ్మేసింది. ఛత్తీస్‌ఘడ్‌లో బాల్కోని కూడా ప్రయివేటుకు కట్టబెట్టింది. అదే విధానాలను తర్వాత మన్మోహన్‌సింగ్ కాంగ్రెస్ కొనసాగించింది. 2014 తర్వాత సొంత బలంతో రెండోసారి అధికారంలోకి వచ్చిన మోడీ సరళీకరణ విధానాలను దూకుడుగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ అమ్మేస్తామని లేకపోతే మూసేస్తామనే విధానాలను చేపట్టారు. నేషనల్ మోనిటైజేషన్ పేరుతో దేశంలోని రైల్వే, పోర్ట్, హైవేలను కూడా విడిచిపెట్టడం లేదు. లీజు పేరుతో ప్రయివేటు వాళ్లకు అప్పగిస్తున్నారు. నేషనల్ ల్యాండ్ మోనిటైజేషన్ పేరుతో పరిశ్రమ భూములను ముందుగా లాక్కొంటుంది. కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్లు తెచ్చింది.

వర్గ పోరాటాల సిద్ధాంతాన్ని ముందుకు తీసుకువెళ్లాలన్నా, కార్మికులకు సమరశీల పోరాటం ద్వారా చైతన్యం చేయాలన్నా యావత్ కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడం ఒక్కటే సరైన మార్గం. ఐక్యత - పోరాటం నినాదంతో రానున్న కాలంలో భారీ పోరాటాలు నిర్వహించడం మన ముందున్న ప్రధాన కర్తవ్యం.

..సిహెచ్.నర్సింగరావు
సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు

పరిశ్రమల మూసివేతలు.. కార్మికుల వెతలు

పశ్చిమగోదావరి జిల్లాలో ఈ కాలంలో పెద్దసంఖ్యలో పరిశ్రమలు మూసివేయడం వల్ల కార్మికులు రోడ్డున పడ్డారు. ఈ పరిశ్రమలు మూసివేయడంలో అన్ని యాజమాన్యాలు చట్ట విరుద్ధంగానే వ్యవహరిస్తున్నాయి. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులతోగాని, యూనియన్లతోగాని ఎలాంటి సంప్రదింపులు జరగకుండా ఏకపక్షంగా పరిశ్రమ వేసినట్లు బోర్డులు పెడుతున్నారు. ఈ మూసివేతలు చట్ట విరుద్ధమైనప్పటికీ కార్మికులకు చట్టప్రకారం పరిహారం ఇవ్వకుండా యాజమాన్యాలు నెలలు తరబడి మొండిగా వ్యవహరిస్తున్నాయి.

తణుకు, భీమడోలులోని ఆంధ్రా సుగర్స్, తణుకులోని శ్రీ అనంతలక్ష్మి టెక్స్‌టైల్స్, వేంద్రలోని డెల్టా పేపర్ మిల్లు, చాగల్లులోని జైపూర్ సుగర్స్, ఏలూరులోని జ్యూట్‌మిల్లు ఈ కాలంలో మూసివేశారు. ఇంత పెద్దఎత్తున మూసివేతలు జరుగుతుంటే కార్మిక శాఖ అధికారుల నుంచి, ప్రభుత్వం నుంచిగాని ఎలాంటి స్పందనా లేకపోవడం బాధాకరం. కార్మిక శాఖ కార్మికులకు చట్టప్రకారం రావాల్సినవి ఇప్పించడంలో, పరిశ్రమలను తిరిగి తెరిపించడంలో చొరవ చూపకుండా చూసీచూడనట్లు వ్యవహరించడం వల్ల కార్మికులు ఉపాధితోపాటు వారికి రావాల్సినవి చాలా కోల్పోతున్నారు.


మూతపడిన వేంద్రలోని డెల్టా పేపర్ మిల్లు

కార్మిక శాఖ నిస్సహాయత వల్ల కార్మికులు పోరాడినా ఎలాంటి ఉపయోగాలూ ఉండవని భావించి యాజమాన్యాలు ఎంతిస్తే అంతే.. ఇవ్వకపోయినా మాట్లాడటం లేదు. శ్రీ అనంతలక్ష్మి పరిశ్రమలో సిఐటియు అనుబంధ యూనియన్ ఉండటం వల్ల కరోనా కాలాన్ని కూడా కార్మికులు లెక్క చేయకుండా ఆరు నెలలపాటు ప్రతిరోజూ ఆందోళన పోరాటాలు సాగించడంతో అత్యధిక నష్టపరిహారం ఇప్పించగలిగాం. పరిశ్రమలు మూసివేసినప్పుడు కార్మికులు ఒకపక్క నష్టపరిహారం లేక, మరోపక్క ఉపాధి లేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. నష్టపరిహారం కోసం పోరాడిన కార్మికులను ఇతర పరిశ్రమల యాజమాన్యాలు తీవ్రవాదులుగా చూడటం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్న కార్మికులు ఎక్కువ మంది ఇతర పనులు, రాష్ట్రాలకు వెళ్తున్నారు.

యాజమాన్యాలు అర్ధాంతరంగా మూసివేసిన పరిశ్రమలపై ఎన్నో లాభాలు పొందారు. కార్మికులకు చట్ట ప్రకారం న్యాయంగా ఇవ్వాల్సిన వేతనాలు కూడా ఇవ్వకుండా కార్మికుల శ్రమదోపిడీ ఆధారంగా ఇతర వ్యాపారాలు ప్రారంభిస్తున్నారు. ఇంత అన్యాయం యాజమాన్యాలు చేస్తున్నప్పటికీ కార్మిక శాఖ, ప్రభుత్వం కార్మికులకు ఎలాంటి ధైర్యం, భరోసా ఇస్తున్న పరిస్థితి మనకు కన్పించడం లేదు.

పరిశ్రమల్లో కార్మికులకు ఉండాల్సిన చట్టాల అమలు ఎలా ఉందో కార్మిక శాఖ పరిశీలించకపోవడం శోచనీయం. పరిశ్రమలో వందలాది మంది పని చేస్తున్నప్పటికీ చట్ట ప్రకారం చాలా తక్కువ మంది పర్మినెంట్ రోల్‌లో చూపించడం వల్ల ఎక్కువ మంది కార్మికులు మూసివేత పరిహారాలకు దూరమవుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.


మూతపడిన చాగల్లు జైపూర్ సుగర్ ఫ్యాక్టరీ

జిల్లాలో నేటికీ పరిష్కారం కాని సుగర్ ఫ్యాక్టరీ (చాగల్లు), జ్యూట్‌మిల్లు (ఏలూరు) కార్మికులు సంవత్సరాల తరబడి న్యాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఏ అధికారులు వచ్చినా కార్మికుల వంక కన్నెత్తి చూడడం లేదు. కార్మిక శాఖ కార్మికుల పక్షాన కాకుండా యజమాన్యాల పక్షాన నిలవడం వల్ల నేడు కార్మికులు పరిశ్రమ మూసివేతల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

శ్రీ అనంతలక్ష్మి కార్మికుల పోరాటం సుదీర్ఘకాలం సాగింది. పోరాడిన ప్రతి కార్మికుడికీ న్యాయం జరిగింది. కార్మిక శాఖ, ప్రభుత్వం యాజమాన్యాల పట్ల ఉదాశీనత వదిలి కార్మికులకు వెనువెంటనే న్యాయం చేయాలి.

అసంఘటిత రంగ కార్మికులకు..

అమలు కాని కార్మిక చట్టాలు



ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికుల జీవితాలు దుర్భరమవుతున్నాయి. కార్మిక చట్టాలు, పిఎఫ్, ఇఎస్ఐ వంటి కనీస సదుపాయాలు అమలు కావడం లేదు. చిల్లర వ్యాపార రంగంలో విదేశీ, స్వదేశీ కార్పొరేట్ శక్తులు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టడం వల్ల సాంప్రదాయకంగా ఉన్న వ్యాపారాలు దెబ్బతిని ఆ రంగాల మీద ఆధారపడి జీవిస్తున్న హమాలీలు, షాపుల్లో పనిచేసే గుమస్తా వగైరాలు ఉపాధి కోల్పోతున్నారు. ఇటీవల కాలంలో పట్టణాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు సాంకేతికతను ఉపయోగించుకుని నేరుగా వ్యాపారాలు నిర్వహించడంతో హమాలీ కార్మికుల ఉపాధి దెబ్బతింటుంది. ఉదాహరణకు తాడేపల్లిగూడెం మార్కెట్‌కు పండ్లు, అపరాలు, కూరగాయలు, ఉల్లిపాయలు, చింతపండు, ఎండుమిర్చి వగైరాలు ఇక్కడ దిగుమతి, ఎగుమతి కావడంతో వ్యాపారాలు లాభసాటిగా జరిగి హమాలీ కార్మికులకు పని ఉండేది. అయితే ప్రస్తుతం తాడేపల్లిగూడెం మార్కెట్‌కు రాకుండా ఇక్కడి నుంచి సరుకులు నేరుగా వెళ్లడంతో కార్మికులకు ఉపాధి లేకుండాపోయింది. పట్టణంలో షాపింగ్ మాల్స్‌లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదు. రూ.ఐదు వేల నుంచి రూ.పది వేల జీతంతోనే పది నుంచి 12 గంటల పాటు నిలబడి పని చేస్తున్నారు. ఎక్కువమంది యువతులతో పని చేయిస్తున్నారు. ఉదయం డ్యూటీకి హాజరైన దగ్గర నుంచి రాత్రి డ్యూటీ దిగేంతవరకు నిలువకాళ్లపై నిలబడి డ్యూటీలు చేస్తున్నారు. పని చేసే చోట బాత్రూమ్‌లు, రెస్ట్‌రూమ్‌లు వంటి సదుపాయాలు లేవు. ఇఎస్ఐ, పిఎఫ్, వారాంతపు సెలవులు అమలు కావడంలేదు. సంస్కరణ విధానాల ఫలితంగా కార్మిక శాఖకు దుకాణాల మీద అజమాయిషీ లేకపోవడంతో షాపింగ్ మాల్స్ 24 గంటలు, సెలవు రోజుల్లో సైతం తెరుచుకుని వ్యాపారాలు చేసుకునే విధానం వల్ల పర్యవేక్షణ లేకుండాపోయింది. పెరుగుతున్న ధరలకు తగ్గట్టుగా కనీస వేతనాలు అమల చేయకపోవడంతో పాతకాలపు వేతనాలతోనే కార్మికులు జీవించాల్సి వస్తుంది. పెట్రోలు, డీజిల్, గ్యాస్, ఇంటి అద్దెలు, కరెంట్ ఛార్జీలు విపరీతంగా పెరిగిపోవడంతో కార్మికులపై అదనపు భారం పడుతోంది.

కరోనా వల్ల పరిశ్రమలు, సంస్థలు మూసివేయడంతో అసంఘటితరంగ కార్మికులు ఉపాధి కోల్పోయారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కోల్పోతున్న కార్మికులు పట్టణ ప్రాంతాలకు వలస రావడంతో కూలీల మధ్య పోటీ పెరిగి కనీస కూలి రేట్లను సాధించుకోలేకపోతున్నారు.

-కర్రి నాగేశ్వరరావు, తాడేపల్లిగూడెం

ఆయన్ని చూసి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను

డిఎన్‌విడి.ప్రసాద్,
సిఐటియు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి



కామ్రేడ్ చింతకాయల బాబూరావు మృతి తీవ్ర దిగ్ర్భాంతికి గురిచేసింది. 15 రోజుల క్రితం ఆకివీడులో రిసెప్షన్లో కలిశాను. ఆయనను చూడడం అదే చివరిసారి. బాబూరావుతో 30 సంవత్సరాల నుంచి పరిచయం ఉంది. 2007లో బాబూరావు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శిగా ఉండగానే నేను సిఐటియులోకి వచ్చాను. బాబూరావుతో కలిసి జిల్లా కేంద్రంలో 15 సంవత్సరాలు కలిసి పనిచేశాను. కార్మికరంగంలో నేను బాగా పని చేసేందుకు ఎంతో ప్రోత్సహించేవారు. కార్మికుల సమస్యలపై పోరాటాలు చేయడం, యూనియన్లు నిర్మించడం, యూనియన్లు ప్రజాతంత్రయుతంగా నిర్వహించడంలో బాబూరావుని చూసి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. అనంతలక్ష్మి టెక్స్‌టైల్స్, త్రివేణి గ్లాస్ ఫ్యాక్టరీ, తిరుమల మిల్క్ ఫ్యాక్టరీ, సమనాన్ ఆగ్రో ఫుడ్స్, నారాయణపురం సిలికా సిరామికా టైల్స్ ఫ్యాక్టరీ, తణుకు డిజిసి వాన్ బరీ పరిశ్రమలలో యూనియన్ ఏర్పాటు, వేతన ఒప్పందాల కోసం జరిగిన సమ్మెలు, పోరాటాలలో బాబూరావు పాత్ర విస్మరించలేనిది. ఆ సందర్భంగా పోరాటాలలో ఆయన చూపిన ధైర్యం, తెగువ, ఎత్తుగడలు ఫలితంగా సమస్యలు పరిష్కరించుకోవడంతో పాటు బలమైన యూనియన్లు నిర్మించుకోగలిగాము. బాబూరావు ప్రధాన కార్యదర్శిగా ఉండగా సంవత్సరంన్నర కాలం నేను జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలలో ఉన్నాను. ఆయన తర్వాత ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నాను. నాకు ఎన్నో సూచనలు, సలహాలు ఇస్తూ బాగా పనిచేసేందుకు తోడ్పడేవారు. సిఐటియు జిల్లా కార్యాలయం స్థలం కొనుగోలు కోసం, భవనం నిర్మించడం కోసం ఎంతో తాపత్రయపడేవారు. బాబూరావు మృతి ఉమ్మడి జిల్లాలో కార్మికోద్యమానికి, సిపిఎం పార్టీకి తీరని లోటు.

కార్మిక, ప్రజా ఉద్యమాల్లో ఎనలేని కృషి

గుడిపాటి నర్సింహారావు,
ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి



చింతకాయల బాబూరావు కార్మిక, ప్రజా ఉద్యమంలో ఉమ్మడి పచ్చిమ గోదావరి జిల్లాలో 30 సంవత్సరాల పాటు చురుకుగా పని చేశారు. 63 సంవత్సరాల వయసులో గుండెపోటుతో మరణించడం చాలా బాధాకరం. 1981లో సాధారణ కార్మికుడిగా సిఐటియుకు పరిచయమై, 2025 వరకు స్థానిక బాధ్యతల నుండి జాతీయ కమిటీ సభ్యుడుగా బాధ్యత వహించారు. 1984లో మొదటిసారి గణపవరంలో డివైఎఫ్ఐ తాడేపల్లిగూడెం తాలూకా అధ్యక్షుడిగా ఉండగా నేను తాలూకా కమిటీ సభ్యుడిగా కలిసి పనిచేసాను. కామ్రేడ్ బాబూరావు భువనపల్లిలో రైస్ మిల్లు డ్రైవర్ గా పనిచేస్తూ అల్లూరి సత్యనారాయణ, మంతెన సీతారాం, సిపిఎం, సిఐటియు నాయకులు కల్పించిన ప్రోత్సాహంతో పూర్తి కాలం కార్యకర్తగా ప్రజా ఉద్యమాలకు అంకితమయ్యారు. గణపవరం నుండి తాడేపల్లిగూడెం మకాం మార్చి తాలూకా ఉద్యమ నాయకుడు అయ్యారు. తాడేపల్లిగూడెం పట్టణం పరిసరాలలో నామమాత్రంగా ఉన్న సిఐటియు, సిపిఎం ఉద్యమాలను బలమైన ఉద్యమాలుగా అభివృద్ధి చేయడంలో బాబూరావు కృషి, తాపత్రయం చాలా ముఖ్యమైనవి. తాడేపల్లిగూడెం తాలూకా మండలాల విద్యార్థి సంఘం ఇన్‌ఛార్జిగా ఉండగా బాబూరావు తాడేపల్లిగూడెం నాయకుడిగా సహకారం అందించడం మరువలేనిది. బాబూరావు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా, నేను జిల్లా అధ్యక్షుడిగా రెండు సంవత్సరాలు కలిసి పని చేశాం. బాబూరావు మిలిటెంట్ నాయకుడిగా ఉండేవారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా 1997 నుండి 2017 వరకు కలిసి ఉద్యమాలు, సంఘాలలో కలిసి పని చేశాం. 2017లో చింతకాయల బాబూరావు ఏలూరు జిల్లా కార్యదర్శి అయ్యారు. పార్టీ ఉద్యమం, కుటుంబ విషయాలకు సంబంధించి మాట్లాడుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. కార్మికులకు వ్యతిరేకంగా యజమాని లేదా అధికారి ఉన్నా వాళ్ల సంగతి తేల్చాలి అనే పద్ధతిలో కార్మికులను ఉత్సాహపరిచేవారు. కుటుంబం అనేక బాధాకరమైన సంఘటనలు ఎదుర్కొన్నా ఉద్యమ ప్రస్థానంలో వాటిని కనపడకుండా బాబూరావు వ్యవహరించడం నాకు తెలుసు. ఆయన గురించి ఈరోజు ఇలాంటి ప్రస్తావన తెచ్చుకోవలసి రావడం చాలా బాధాకరం. అయినా సమరశీల పోరాటాలు పెంచడం, కలుపుగోలుగా ఉండటం, అందరినీ కలుపుకొనే మనస్తత్వం కలిగి ముందుకు సాగడం మనం నేర్చుకోవాలి, పెంచుకోవాలి. అదే బాబూరావు నుండి నేర్చుకోవాల్సిన స్ఫూర్తి అని భావిస్తూ తీవ్ర సంతాపం తెలియజేస్తున్నాను. బాబూరావు భార్య శ్రీదేవికి, కుమారుడు సిద్ధార్థ కు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

బాబూరావు మృతి కార్మికవర్గానికి తీరని లోటు

ఆర్.లింగరాజు, సిఐటియు ఏలూరు జిల్లా అధ్యక్షులు



కామ్రేడ్ చింతకాయల బాబూరావు మృతి కార్మికవర్గానికి తీరని లోటు. ఆయన జీవితం కార్మికులతో పెనవేసుకుపోయి ఉంది. రైస్‌మిల్లు డ్రైవర్‌గా ప్రారంభమైన తన జీవన పోరాటం రైస్ మిల్లు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు వైపు ఆకర్షితున్ని చేసింది. సిఐటియులో చేరి అనేక ఉద్యమాలు, పోరాటాల ద్వారా రైస్ మిల్లు కార్మికుల నాయకుడిగా, తదనంతరం సిఐటియు నాయకుడిగా, పూర్తికాలం కార్యకర్తగా, తాడేపల్లిగూడెం డివిజన్ పార్టీ కార్యదర్శిగా, అనంతరం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శిగా, తదనంతరం సుమారు నాలుగు సంవత్సరాల పాటు ఏలూరు అప్ ల్యాండ్ పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. ఏలూరు జిల్లాలో ప్రత్యక్షంగా ఆయనతో కలిసి పని చేసే అవకాశం 10 ఏళ్లకుపైగా నాకు కలిగింది. బాబు అంటూ అందరినీ ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు తెలుసుకునేవారు. కార్మికుల సమస్యలు, ప్రజా సమస్యల గురించి చర్చించేవారు. జిల్లాలో సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలపై సుదీర్ఘకాలం పోరాటాలు చేశారు. రైస్‌మిల్లు కార్మికులు, బజారు జట్టు కార్మికులు, ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై అనేక ఉద్యమాలు నడిపారు. ఉంగుటూరు మండలం నారాయణపురంలోని జాన్సన్ అండ్ జాన్సన్ టైల్స్ ఫ్యాక్టరీలో యూనియన్ నిర్మాణానికి ఎంతో కృషి చేశారు. ఏడు రోజులపాటు ఆ ఫ్యాక్టరీలోనే 200 మందికిపైగా ట్రెయినీస్‌తో సమ్మె పోరాటం జరిగింది. ఆ సందర్భంలో కామ్రేడ్ బాబూరావు కృషి, పట్టుదల, ఓపికతో వ్యవహరించిన తీరు నేను ప్రత్యక్షంగా చూశాను. యూనియన్ ఏర్పాటు కంటే కార్మికుల ప్రయోజనాలు, వారి సమస్యల పరిష్కారమే ముఖ్యమని, వారి సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యంతో ఒప్పందం చేసుకొని యూనియన్ లేకుండా ఉండాలని యాజమాన్యం పెట్టిన సరతకు అనివార్య పరిస్థితిలో అంగీకరించాల్సి వచ్చింది. ఇక్కడ యూనియన్ ముఖ్యమా? కార్మికుల సమస్యల పరిష్కారం ముఖ్యమా అనే సమస్య వచ్చినప్పుడు కార్మికుల సమస్యలు ముందు పరిష్కారం కావాలి అనే వైఖరి తీసుకోవడంతో వందలాది మంది కార్మికులు ఎలాంటి నష్టం లేకుండా అనేక సౌకర్యాలు పొందుతూ ఒప్పందం జరిగింది. ఇలాంటి అనేక సందర్భాల్లో కామ్రేడ్ బాబూరావు కార్మికుల పక్షాన తన జీవితాంతం పనిచేశారు. వారి కుటుంబంతో కూడా నాకు అనుబంధం ఉంది. కుటుంబంలో ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా చెక్కుచెదరకుండా కమ్యూనిస్టు స్ఫూర్తితో వాటన్నింటిని ఎదుర్కొని, చివరి వరకు పార్టీలో పనిచేశారు. ఆయన మృతి కార్మికవర్గానికి, సిఐటియుకు, సిపిఎంకి తీరని లోటు. ఆయన మృతికి సిఐటియు జిల్లా కమిటీ పక్షాన తీవ్ర సంతాపం తెలుపుతున్నాం. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాం. వారి కుటుంబానికి సిఐటియు ఎల్లవేళలా అండదండలుగా నిలబడుతుంది.

ఎర్రజెండా ముద్దుబిడ్డ బాబూరావు

చిర్ల పుల్లారెడ్డి, ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



చింతకాయల బాబూరావు అకాల మరణం సిఐటియు, సిపిఎం, ప్రజాసంఘాలకు తీరని లోటు. తాడేపల్లిగూడెం పట్టణంలో సిఐటియు బలోపేతానికి విశేష, నిర్విరామ కృషి చేసిన ధీరుడు బాబూరావు. పట్టణంలోని అన్ని మార్కెట్లో 1985 నుండి 2005 వరకూ జరిగిన అనేక పోరాటాలు, ఉద్యమాల్లో చింతకాయల బాబూరావు కీలకపాత్ర పోషించారు. కార్యకర్తల అభివృద్ధికి నిరంతరం తపించేవారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు దిశానిర్దేశం చేసేవారు. అటువంటి వ్యక్తి భౌతికంగా దూరం కావడం చాలా బాధాకరం. ఆయన నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి.

ఉపాధ్యాయ ఉద్యమాలకు అండగా బాబూరావు

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు
పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం

ప్రజాశక్తి - భీమవరం



కార్మికోద్యమ నేత చింతకాయల బాబూరావు సిఐటియులో పని చేస్తున్న సమయంలో ఉపాధ్యాయ ఉద్యమానికి అందించిన సహకారం మరువలేనిది. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆయన నిరంతరం అండగా నిలిచేవారు. ముఖ్యంగా ఆయన భార్య శ్రీదేవి ఉపాధ్యాయ సంఘంలోకి రావడానికి ఎంతో ప్రోత్సహించారు. ప్రస్తుతం ఆమె యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా పని చేస్తూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, యుటిఎఫ్ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. బాబూరావు మృతి కుటుంబానికే కాకుండా ఉపాధ్యాయ ఉద్యమానికీ తీరని లోటు. ఆయన కుటుంబానికి యుటిఎఫ్ పశ్చిమగోదావరి జిల్లా కమిటీ తరపున ప్రగాడ సానుభూతి తెలియజేస్తున్నాం.

బాబూరావు ఆశయ సాధనకు కృషి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం



రైస్‌మిల్లులో డ్రైవర్‌గా జీవితాన్ని ప్రారంభించి అంచలంచెలుగా జిల్లా ముఖ్య నాయకునిగా కామ్రేడ్ బాబూరావు ఎదగడం అనేది సాధారణ విషయం కాదు. కార్మికుల అగ్రిమెంట్ల సమయంలో వెనుకడుగు వేయకుండా ప్రజాతంత్ర పద్ధతుల్లో కార్మికులకు యాజమాన్యాల నుంచి తగిన న్యాయం చేయడంలో కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా వర్గ దృక్పథాన్ని కార్మికులకు నేర్పించారు. యాజమాన్యాల పట్ల ఎత్తుగడలు, పోరాటాలు, అరెస్టులు, నిర్బంధాలకు వెన్ను చూపకుండా పోరాటాలు నడిపారు. తాను నమ్మిన సిద్ధాంతం, ఆశయం కోసం, తుదిశ్వాస విడిచే వరకు కట్టుబడి పని చేశారు. బాబూరావు అకాల మరణం కార్మికవర్గానికి తీరని లోటు. ఆయన భౌతికంగా లేకపోయినప్పటికీ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్మికవర్గంపై ఉంది. ఆయన ఆశయ సాధనకు కార్మికులంతా సమిష్టిగా కృషి చేయాలి.

కామ్రేడ్ బాబూరావుతో సాన్నిహిత్యం మరిచిపోలేనిది

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కల్యాణి

ప్రజాశక్తి - భీమవరం



బాబూరావు తాను నమ్మిన ఆశయం కోసం తుది శ్వాస విడిచే వరకు పని చేశారు. ఆయనతో నాకున్న సాన్నిహిత్యం మరిచిపోలేనిది. నాయకుడిగానే కాకుండా కుటుంబ పెద్దలా ఉండే వారు. ఎప్పుడూ పలుకరించినా యోగక్షేమాలు అడిగి తెలుసుకునే వారు. పనిలో ఉన్న చిన్న చిన్న లోటుపాట్లను గుర్తు చేస్తూ ముందుకు నడిపారు. సిఐటియు నేతగా నా అభివృద్ధికి అనేక సూచనలు చేశారు. ఆయన భౌతికంగా లేని లోటు పార్టీకి, మాకు తీరనిది. ఆయన ఆశయాలు, అనుభవాలతో ముందుకు నడవడమే ఆయనకు మనం ఇచ్చే ఘన నివాళి.

నా రాజకీయ గురువు కామ్రేడ్ బాబూరావు

సిపిఎం నేత కండెల్లి సోమరాజు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



1984లో ఆయన మొదటిగా మా గ్రామం నవాబుపాలెం వచ్చి నా దగ్గరకు వచ్చారు. నేను అప్పట్లో పెయింటింగ్ కార్మికునిగా పని చేస్తున్నాను. బాబూరావు ప్రోత్సాహంలో మా గ్రామంలో డివైఎఫ్ఐ కమిటీ ఏర్పాటు చేశాం. అప్పారావుపేటలో ల్యాండ్ సీలింగ్ భూముల పోరాటం చేసి చుట్టుపక్కల నాలుగు గ్రామాల్లో 132 మందికి 40 సెంట్లు భూమి చొప్పున పేదలకు ఇచ్చారు. ఇప్పటికి ఆ భూములను సిపిఎం పొలాలు అంటారు. కార్మికుల వేతనం ఒప్పందాల అంశాల్లో కార్మికుల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చేవారు. ఆయన నిరంతరం గొప్ప అధ్యయనశీలి. మమ్మల్ని కూడా పుస్తకాలు చదవమని ప్రోత్సహించేవారు. అనేక కష్టాలు, నష్టాలను తట్టుకుని పార్టీ విస్తరణ లక్ష్యంగా పని చేసిన గొప్ప నాయకుడిని కోల్పోవడం చాలా బాధాకరం. ఆయన ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తాం.

బాబూరావు మృతి తీరనిలోటు

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



కామ్రేడ్ చింతకాయల బాబూరావు ఆకస్మిక మృతి కార్మికవర్గానికి, నాకు వ్యక్తిగతంగా తీరనిలోటు. 1985లో రంగరాజు రైస్‌మిల్లులో కార్మికులను సంఘంలోకి తీసుకొచ్చారని పోలీసులతో రైస్‌మిల్లు వద్ద కార్మికులపై దాడికి తెగబడ్డారు. పోలీసుల కాల్పుల్లో రైస్‌మిల్లు యూనియన్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డికి బుల్లెట్ గాయాలయ్యాయి. 1986లో అపరాల మార్కెట్‌లో 70 రోజుల సమ్మె జరిగింది. ఈ సందర్భంగా బాబూరావుపై దాడికి యాజమాన్యం సిద్ధపడగా కార్మికవర్గం తిప్పికొట్టింది. 1992లో ఉల్లిపాయల మార్కెట్ వేరేప్రాంతానికి తరలించాలన్న యాజమాన్య ప్రయత్నాలను తిప్పికొట్టడంతో బాబూరావు ప్రముఖ పాత్ర పోషించారు. మార్కెట్ యార్డు కార్మికుల సమస్యలపై, పడాల కార్మికుల మధ్య వచ్చిన సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించారు. ఆయన బాటలో ముందుకు సాగి.. బాబూరావు ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రతినబూనుతూ ఆయనకు విప్లవ జోహార్లు అర్పిస్తున్నాను.

తుది శ్వాస విడిచే వరకు పోరాటాలే బాబూరావు ఊపిరి

వి.శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి



తుదిశ్వాస విడిచే వరకూ పోరాటాలే ఊపిరిగా సిపిఎం సీనియర్ నేత చింతకాయల బాబూరావు జీవించారు. సాధారణ కార్మికునిగా జీవితాన్ని ప్రారంభించిన బాబూరావు అంచెలంచెలుగా ఎదిగి జిల్లాలో ముఖ్యనేతగా, రాష్ట్రస్థాయిలో కార్మిక నేతగా వ్యవహరించిన తీరు అందరికీ స్ఫూర్తినిస్తుంది.ఆయన అకాల మరణం పీడిత ప్రజలకు, కార్మికోద్యమాలకు, సిపిఎంకు, కుటుంబానికి తీరని లోటు. కార్మికులు, రైతులు, ప్రజాసంఘాల కార్యకర్తలు బాబూరావు ఆశయ సాధనకు కృషి చేసి, ఆయన స్ఫూర్తితో జిల్లాలో, తాడేపల్లిగూడెంలో బలమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించాలి.

ఆయన లేని జీవితం ఊహించుకోలేను

భార్య శ్రీదేవి



ఆయన తోడు లేని జీవితాన్ని నేను ఊహించు కోలేకపోతున్నాను. ఆయన లేని లోటు చాలా బాధాకరం. నేను ఈరోజు ఒక ఉపాధ్యాయురాలిగా ఉన్నానన్నా, ఉపాధ్యాయ సంఘంలో రాష్ట్ర స్థాయికి ఎదగడానికి కారణం ఆయనే. ప్రతి విషయంలోనూ పాజిటివ్ థింకింగ్ నేర్పి, అడుగడుగునా ప్రోత్సహిస్తూ ముందుకు నడిపించారు. ఈరోజు ఇలా ఒంటరిని చేశారు. నా ఆశయ సాధనలో ఇక ముందు ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందుకి సాగుతాను. ఆయన ఇచ్చిన ధైర్యాన్ని నిలబెట్టుకుంటాను.

ఎన్నో కష్టాలను అధిగమించారు

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు



బాబూరావు ఉద్యమాల్లో తీవ్ర కష్టాలు ఎదుర్కొన్నారు. వ్యక్తిగతంగా, కుటుంబపరంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చిరునవ్వు తో పలకరిస్తూ ఎన్నో కష్టాలను చింతకాయల బాబూరావు అధిగమించారు. బాబూరావు ఎంచుకున్న ఆశయానికి ఏమాత్రం వెనకడు గు వేయకుండా తన జీవితాన్ని సైతం ఉద్యమాలకు త్యాగం చేశారు. సాధారణ కార్మికునిగా జీవితాన్ని ప్రారంభించి, ఆశ యం కోసం కట్టుబడి జీవితాంతం పనిచే శారు. ఉద్యోగ జీవితాన్ని వదిలిపెట్టి చాలీ చాలని వేతనంతో అనేక త్యాగాలు చేశా రు. జిల్లాలో ప్రధాన నేతగా ఎదిగి అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ముఖ్యంగా తాడేపల్లిగూడెంలో కార్మిక రంగాలను నిర్మించి, ఉద్య మాలు నడిపారు. సమరశీల పోరా టాలు చేసి సమస్యల పరి ష్కారా నికి కషి చేశారు. నైపుణ్యం ఉన్న నాయకులను అసంఘటితం చేసి, ఉద్యమాలు నడిపి రైల్వే, లోడింగ్, అన్లోడింగ్, బజారు జట్లు సంఘాల నిర్మాణం చేసి చెరగని ముద్ర వేసుకున్నా రు. రాష్ట్రంలోనే ముఠా కార్మికులను సమిష్ట పరిచి రాష్ట్ర ఉద్యమా లకు కృషి చేశారు. క్రమశిక్షణ, చైతన్య పరచేందుకు క్లాసులు నిర్వహించారు. ఆరేళ్ల క్రితం నుంచి ఆరోగ్యం బాగో లేకపోయినా ఉద్యమాల్లో ఏమాత్రం తగ్గకుండా పనిచేశారు. కుటుంబ సమస్యలు, ఒడిదుడుకులు ఎదురై నప్ప టికీ ఎక్కడా వెనకడుగు వేయకుండా కష్టా లను స్వీకరించి, కష్టజీవుల జీవితాల్లో వె లుగులు నింపిన మహోన్నత వ్యక్తి బాబూరావు.

చదువుకు, క్రమశిక్షణకు నిదర్శనం మా నాన్న

కుమారుడు చింతకాయల సిద్ధార్థ



మా నాన్నగారు మాలో మనోధైర్యం నింపి, మా అమ్మను ఒక స్వతంత్ర మహిళగా తీర్చిదిద్ది, నా చేత డిగ్రీ పూర్తి చేయించి ప్రశాంతంగా వెళ్లిపో యారు. ఆయన లేని లోటు పూడ్చలేనిది. మర ణానంతరం కూడా వారి భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల శిక్షణ, అభ్యాసం కోసం దానం చేయడం వారికి చదువుపై ఉన్న ఆసక్తికి నిదర్శనం. గొప్పగా బతకడం అంటే డబ్బు వెనుకాల పరిగెత్తడం కాదు. సాటి మనిషికి సాయం చేయడం, తోటి మనిషికి తోడుగా నిలబడ టం అని ఆయన నిరూపించారు. బయటికి వెళ్తే చిన్నవారి నుంచి పెద్దవారు వరకు అందరినీ ప్రేమగా పలకరించే ఆయన లేనిలోటు ఎవరూ తీర్చలేరు.



కామ్రేడ్ చింతకాయల బాబూరావు ధన్యజీవి

బి.బలరాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు



ప్రజాశక్తి - భీమవరం

సిపిఎం ఏలూరు జిల్లా పూర్వ కార్యదర్శి, ప్రస్తుత పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, కార్మిక నేత కామ్రేడ్ చింతకాయల బాబురావు (63) అక్టోబర్ 30న గుండె సంబంధిత సమస్యతో చికిత్స పొందుతూ ఆకస్మికంగా మృతి చెందడం చాలా బాధాకరం. ఆయన అకాల మరణం పీడిత ప్రజలకు, కార్మికోద్యమాలకు, సిపిఎంకు, కుటుంబానికి తీరని లోటు. సాధారణ రైస్‌మిల్ కార్మికునిగా గణపవరంలో 1982లో కార్మిక ఉద్యమానికి పరిచయమయ్యారు. కార్మిక ఉద్యమ జిల్లా నాయకత్వం అల్లూరు సత్యనారాయణ, కొల్లా వెంకటరత్నం, సిపిఎం రాష్ట్ర నేత మంతెన సీతారాం తదితరులు ప్రత్యేక శ్రద్ధ, ప్రోత్సాహంతో తొలుత గణపవరం, తర్వాత తాడేపల్లిగూడెం తాలూకాలో కార్మికోద్యమ నాయకునిగా అభివృద్ధి అయ్యారు. పార్టీ నాయకత్వ పిలుపు, ఆకాంక్ష, ప్రోత్సాహంతో కార్మిక వృత్తిని వదిలి తన యావజ్జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేశారు. పూర్తికాలపు కార్యకర్తగా ముందుకొచ్చి చివరి శ్వాస వరకు ఎటువంటి ఊగిసలాటలు, నేను వెనుదిరిగి చూడటం లేకుండా అంకితమై త్యాగంతో కృషి చేశారు. పార్టీ ప్రోత్సాహం, పట్టుదలతో, అంకిత భావంతో, స్వయంకృషి ద్వారా తొలుత యువజన రంగం, తదుపరి కార్మిక రంగ బాధ్యతలతో పాటు పార్టీ బాధ్యతలు నిర్వహించేలా ఎదిగారు. సిపిఎం తాడేపల్లిగూడెం తాలూకా, డివిజన్ కార్యదర్శిగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సెక్రటేరియట్ సభ్యునిగా, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, కేంద్ర కౌన్సిల్ సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. గణపవరం, తాడేపల్లిగూడెం టౌన్, పాత తాలూకాలో పార్టీని, ప్రజారంగాలను నిర్మించి బలోపేతం చేయడంలో ముఖ్యపాత్ర వహించారు. పెత్తందారులకు వ్యతిరేకంగా గ్రామీణ పేదల సమస్యలపై, కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం స్పందించడం, సమరశీల ఉద్యమాల నిర్వహణలో కామ్రేడ్ బాబూరావుది ప్రధాన పాత్ర. కుటుంబంలో తీవ్ర ఆటుపోట్లు, గట్టి ఎదురు దెబ్బలు విషాద రూపంలో తగిలినా కుంగిపోకుండా మనోనిబ్బరంతో పార్టీ కల్పించిన చైతన్యంతో నమ్మిన సిద్ధాంతం కోసం దృఢంగా నిలబడ్డారు. అప్పగించిన బాధ్యతలు సమర్థవంతంగా, ఆదర్శవంతంగా నిర్వహించారు. పార్టీ, కార్మిక, ప్రజా ఉద్యమాల పెరుగుదలకు దోహదపడ్డారు. చిరునవ్వు, ఆప్యాయతతో పలకరింపు, కలుపుగోలుతనం, అన్ని రాజకీయ పార్టీలు, పలు సంస్థలు, సంఘాల నాయకులను ఎంతగానో ఆకట్టుకున్నారు. అందరి అభిమానాన్ని చూరగొన్నారు. బంధుగణంపై మంచి ప్రభావం కలిగించారు. సమస్యలు, సిద్ధాంతం విషయంలో ఏనాడూ రాజీ పడలేదు. స్వయంకృషితో ఉన్నత విద్య అభ్యసించారు. సైద్ధాంతిక అధ్యయనం చేశారు. సాధారణ కార్మికుని నుండి జిల్లా కార్మిక, పార్టీ నేతగా అభివృద్ధి అయిన తీరు కమ్యూనిస్టు పార్టీలోనే సాధ్యమనే విషయాన్ని కామ్రేడ్ బాబూరావు నిరూపించారు. జీవిత భాగస్వామి శ్రీదేవి రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యమ నేతగా అభివృద్ధి కావడంలో బాబూరావు ప్రోత్సాహం, కృషి చెప్పుకోదగినది. కామ్రేడ్ బాబూరావు ధన్యజీవి. ఆయన జీవితం, కృషి అందరికీ స్ఫూర్తిదాయకం. ఆయన ఆదర్శ కృషి, నిర్వహించిన పాత్ర చిరస్మరణీయం.





www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 6 నవంబర్ 2025

8 పేజీలు





టెట్.. టెర్రర్..!

ఉమ్మడి పశ్చిమలో 5 వేల మంది గురువులకు తప్పని టెట్

డిసెంబర్ 10న నిర్వహించేందుకు సన్నాహం

ఐదేళ్లు సర్వీసు నిండిన ఉపాధ్యాయులంతా టెట్ రాయాల్సిందేనని కోర్టు తీర్పు

తమను మినహాయించాలని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల డిమాండ్



ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయులపై టెట్ టెర్రర్ విరుచుకుపడింది. ఎన్నో ఏళ్ల నుంచి ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నా టెట్ ద్వారా మరోసారి అర్హత సాధించాలంటూ పెట్టిన నిబంధనపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు ఐదు వేల మంది టెట్ రాయాల్సి ఉంటుందని విద్యాశాఖ ప్రాథమికంగా అంచనాకు వచ్చింది. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) పద్ధతిన నిర్వహించే టెట్‌ను డిసెంబరు పదో తేదీన నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదలవ్వగా, కొద్ది రోజులుగా ఈ పరీక్షపైనే ఉపాధ్యాయుల్లో విస్తృత చర్చ సాగుతోంది. విద్యాహక్కు చట్టం అమలుకు ముందు నియమితులై, ఉద్యోగ విరమణకు ఐదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ సర్వీసు మిగిలి ఉన్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులంతా టెట్‌లో అర్హత సాధించాల్సిందేనంటూ సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. దీనికి అనుగుణంగా 2001 సెప్టెంబరు మూడో తేదీకి ముందు నియమితులైన టీచర్లకు టెట్ తప్పనిసరి కాదని చెబుతున్నారు. అయితే 2010కి ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయుల్లో కలవరం మొదలైంది. టెట్ పరీక్షపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంత వరకూ అధికారిక ప్రకటనేదీ లేకపోయినా గతంలో జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి జారీ చేసిన నోటిఫికేషన్, తాజాగా సుప్రీంతీర్పు నేపథ్యంలో ప్రస్తుతం పని చేస్తున్న టీచర్లు ఆందోళన చెందుతున్నారు.

అనుభవం ఉన్న టీచర్లకు మళ్లీ అర్హత పరీక్ష..?

దశాబ్దాల బోధనానుభవం ఉన్న టీచర్లకు మళ్లీ ఇప్పుడు అర్హత పరీక్ష (టెట్) ఏమిటని అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 1998 డిఎస్‌సి నుంచి 2006 డిఎస్‌సి వరకూ ఎంపికైన ఉపాధ్యాయులే ప్రస్తుతం జిల్లాలో అత్యధికంగా పని చేస్తున్నారు. 2010లోనే నోటిఫికేషన్ జారీ చేశారు. ఉపాధ్యాయ విద్యకు సంబంధించి డిఎడ్, బిఎడ్ అర్హతలున్నప్పటికీ, ఉద్యోగ నియామకాలకు అర్హత పరీక్ష టెట్‌లో ఉత్తీర్ణతను తప్పనిసరి చేస్తూ 2010 ఆగస్టులో ఎన్‌సిఇఆర్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి అనుగుణంగానే తదుపరి ఉపాధ్యాయ నియామకాలన్నింటికీ టెట్ తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఆ ప్రకారం డిఎస్‌సి-2012 రిక్రూట్‌మెంట్ నుంచి టెట్ ఉత్తీర్ణతను తప్పనిసరి చేశారు. ఆ తర్వాత 2014, 2018 తాజాగా మెగా డిఎస్‌సి-2025 నియామకాలన్నీ టెట్ ఉత్తీర్ణులతోనే జరిగినందున వీరి విషయంలో ఎటువంటి సమస్యలూ తలెత్తే అవకాశం లేదు. ఈ క్రమంలో గతంలో అంటే 2010కి ముందు ఉద్యోగంలో చేరిన టీచర్లు కూడా ఇప్పుడు టెట్ రాసి అర్హత సాధించాల్సిందేనని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం, ఆ మేరకు రెండేళ్లలోపే టెట్‌లో ఉత్తీర్ణత సాధించాలని ..6లో



ర్యాలీఅగ్రభాగాన నేతలు, కార్యకర్తలు

ఎర్రజెండా అండతోనే భూ పోరాటాలు సాధ్యం

- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్
- ప్రతి పేదవాడికి 2 ఎకరాల భూమి పంచాలి
- ఎర్రకాల్వ మిగులు భూములు పేదలకే చెందాలి
- ఘనంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభ ప్రారంభం



మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎర్రజెండా అండతోనే భూపోరాటాలు సాధ్యమని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 32వ జిల్లా మహాసభ బుధవారం స్థానికంగా ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, వ్యవసాయ కూలీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని ప్రదర్శనగా బయలుదేరారు. ఈ సందర్భంగా గిరిజన సంప్రదాయ నృత్యాలతో, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వేషధారణ, భగత్‌సింగ్ వేషధారణతో అలరిస్తూ అంబేద్కర్ సెంటర్ మీదుగా సభా ప్రాంగణం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పేదలకు భూమి పంచాలని, కూలీలకు కనీస వేతనం ఇవ్వాలని నినదించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్య అతిథి వెంకట్ మాట్లాడుతూ ఎర్ర కాల్వ మిగులు భూములు పేదలకు పంచాలని ఆరేళ్లుగా గిరిజన పేదలు పోరాటాలు చేస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. భూపోరాటాలు విజయవంతం కావాలంటే ఎర్రజెండా అండతోనే సాధ్యమన్నారు. జిల్లాలో అన్ని రంగాల కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేలా పోరాడేందుకు వ్యవసాయ కార్మిక సంఘం నిరంతరం పని చేస్తుందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం ..6లో

నేడు చింతకాయల బాబూరావు సంస్మరణ సభ 5లో..

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న
ఐటిడిఎ పిఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పరిహారం విషయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐటిడిఎ పిఒ రాములునాయక్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సిపిఎం మండల కమిటీ సమావేశం పోలోజు నాగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ కుక్కునూరు మండలానికి చెందిన కూటమి నాయకులతో కలిసి ఐటిడిఎ పిఒ రాములు నాయక్ నిర్వాసితుల నుంచి పెద్దఎత్తున కమిషన్ రూపంలో దండుకుంటున్నారని, దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, ఐటిడిఎ పిఒపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల నాయకులు కొరసా జలపాలు, మంద్ర బుల్లెమ్మ, కురసం భీమరాజు, పూనం శేఖర్, మడకం శ్రీదేవి, మడకం పోచమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు, శానిటేషన్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఆలిండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (ఎఐసిసిటియు) జిల్లా కార్యదర్శి వేముల ఐక్యయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన బుధవారం మాట్లాడుతూ కార్మికులకు గడిచిన నాలుగు నెలలుగా జీతాలు, బిల్లులు చెల్లించలేదన్నారు. శానిటేషన్ వర్కర్లతో అనేక రకాల పనులు చేయించుకుంటూ వారిని ఆయాలుగా మార్చి, కట్టు బానిసలుగా వాడుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మంగమ్మ, కోపూరు అరుణకుమారి, గుణదల జస్వంత, మల్లెపం భవాని, కంచర్ల జ్యోతి, కొమ్ము మహాలక్ష్మి, చిన్నం ఏసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని అంకాలగూడెం ఎస్‌సి పేటలో మండల పరిషత్ నిధులు రూ.నాలుగు లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి గంజిమాల రామారావు, వైసిపి జిల్లా వైస్ ప్రెసిడెంట్ మంతెన సోమరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో స్థానిక సర్పంచి గడ్డియ్య, స్థానిక ఎంపిటిసి సభ్యులు కింగ్, వైసిపి పోలవరం నియోజకవర్గ ఎస్‌సి సెల్ ప్రెసిడెంట్ ఏలేటి చంద్రం, ఎఎంసి మాజీ డైరెక్టర్ రామకృష్ణ, వార్డ్ మెంబర్ దొరబాబు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు
9న నగదు బహుమతులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన పది మంది విద్యార్థులకు రూ.లక్ష విరాళాన్ని యువజన నేత వాడపల్లి రమేష్, భావనవిజయ దంపతులు బుధవారం విరాళంగా అందించారు. మండలంలోని గంగవరం గ్రామంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా, మండల కాపు సంఘం నాయకులకు ఇందుకు సంబంధించిన రూ.లక్ష చెక్కును అందించారు. గత విద్యాసంవత్సరం పదో తరగతి పరీక్షల్లో మండలంలోని అన్ని ప్రభుత్వ హైస్కూళ్లలో ఒక్కో హైస్కూల్ నుంచి టాపర్‌గా నిలిచిన పది మందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.పది వేల చొప్పున నగదు బహుమతి అందించాలని కోరారు. తొమ్మిదో తేదీ జంగారెడ్డిగూడెంలో నిర్వహించే మెట్ట ప్రాంత కాపు వన సమారాధనలో నగదు పురస్కారాన్ని విద్యార్థులకు అందిస్తామని కాపు సంఘం మండలాధ్యక్షుడు మంచాల వెంకయ్య నాయుడు తెలిపారు. కాపు పొలిట్ బ్యూరో సభ్యుడు చోడిపిండి సుబ్రహ్మణ్యం, మెట్టప్రాంత కాపు నాయకులు మేకల అన్నవరం, రాజవరం నాయకులు బల్లే కేసుబాబు పాల్గొన్నారు.

డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని నిరసన

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని సానారుద్రవరం ఆర్‌సిఎం చర్చి నుంచి సాయిబాబా ఆలయం వరకు డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన తెలిపారు. సిమెంట్ రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని తొలగించి డ్రెయినేజీ నిర్మించాలని కలిదిండి, ముదినేపల్లి మండలాల ప్రాంతీయ కమిటీ సభ్యులు జక్కుల మహేష్ అన్నారు. డ్రెయినేజీ నీరు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో రోడ్డుపై మట్టి పేరుకుపోయి ప్రజలు, వాహనదారులు నానా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి, సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గొల్ల వెంకటరత్నం, బిరుదుగడ్డ భానుప్రకాష్, దాసరి లాజరు, తాటి మరియమ్మ, జక్కుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు, గ్రామస్తులు

పోలవరాన్ని ప్రత్యేక ఆదివాసీ జిల్లాగా ప్రకటించాలని ర్యాలీ



ర్యాలీ చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం నియోజకవర్గంలోని ఏజెన్సీ మండలాలను కలిపి ప్రత్యేక ఆదివాసీ జిల్లాగా ఏర్పాటు చేయాలని, దానికి పూర్తిం సింగరాజు దొర పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం కుక్కునూరులో ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం ముట్టడించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూరం సంజీవరావు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గాన్ని ప్రత్యేక ఆదివాసీ జిల్లాగా ప్రకటించే వరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రచార కార్యదర్శి పోడియం వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి మడకం చంద్రరావు, మండలాధ్యక్షులు సరియం ప్రసాదరావు, రఘుబాబు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు చెట్ల దుంగలకు బహిరంగ వేలం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో చెట్ల దుంగల బహిరంగ వేలం ఈ నెల ఆరో తేదీ గురువారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రనాథ్ తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన బుధవారం మాట్లాడుతూ వివిధ రకాలైన చెట్ల దుంగలను బహిరంగ వేలం వేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తామన్నారు. బహిరంగ వేలం పాటలో పాల్గొనే ఔత్సాహికులు రూ.20 వేలు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.1.61 లక్షలకు పైగా వేలంపాట పాడిన వారికి చెట్ల దుంగలను అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం ధర కంటే తక్కువగా వేలం కొనసాగిన, నిబంధనల మేరకు కొనసాగకపోయినా బహిరంగ వేలం పాట రద్దు చేసే హక్కు ఎంపిడిఒకు ఉంటుందని స్పష్టం చేశారు.


ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో దుంగలు

గురజలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా గురజ గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు గ్రామపంచాయతీ చర్యలు చేపట్టింది. గ్రామంలో గత ఐదు రోజులుగా దోమల నిర్మూలన కార్యక్రమం, పారిశుధ్యం మెరుగుకు సర్పంచి మంచాల సరస్వతి చర్యలు చేపట్టారు. దీపావళికి ముందు, ఆ తరువాత కురిసిన భారీ వర్షాలు, తుపాన్ ప్రభావంతో గ్రామంలో కురిసిన వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులకు ఎలాంటి అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామపంచాయతీ ముందస్తు పారిశుధ్య చర్యలు చేపట్టారు. గ్రామంలో రోడ్ల వెంబడి నిల్వ ఉన్న వరద నీటిని బయటకు మళ్లించారు. మురుగు కాలువల్లో నీరు లేకుండా చేసి బ్లీచింగ్ చల్లారు. అదే విధంగా గ్రామంలోని పలు కాలనీల్లో, ఎస్‌సి ఏరియాలో ప్రతి బజారులో నిల్వ ఉన్న నీటిని తొలగించి డ్రెయినేజీల్లో పూడికతీతతో పాటు బ్లీచింగ్ చల్లి, దోమల నివారణకు గ్రామమంతా ఫాగింగ్ మిషన్‌తో పిచికారీ చేశారు. గ్రామంలోని రోడ్ల వెంబడి, నివాస ప్రాంతాల్లో ఎలాంటి దుర్గంధం లేకుండా చర్యలు తీసుకున్నారు. మంచినీటి చెరువులో క్లోరినేషన్ చేసి స్వచ్ఛమైన నీటిని గ్రామస్తులకు సరఫరా చేస్తున్నట్లు సర్పంచి మంచాల సరస్వతి తెలిపారు. ఈ పనులను సర్పంచితో పాటు పంచాయతీ కార్యదర్శి హరిక పరిశీలించారు.


పొగ పిచికారీ చేస్తున్న సిబ్బంది


బాల్య వివాహం చేస్తే
అనారోగ్య సమస్యలు

ప్రజాశక్తి - ముసునూరు

బాల్య వివాహం చేస్తే ఆ బాలిక యుక్త వయసులోనే అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటుందని సిడిపిఒ విజయకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పి.ఏసుబాబు, తహశీల్దార్ డి.ప్రశాంతి ఆధ్వర్యంలో మండలంలోని 16 గ్రామ పంచాయతీల అధికారులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో చిన వయసులోనే ఆడపిల్లలు చాలా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందన్నారు. ప్రతి నెల రెండో శుక్రవారం సచివాలయ స్థాయిలో, ప్రతి మూడో శుక్రవారం మండల స్థాయిలో అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు
ఎస్‌సి కార్పొరేషన్ ఇడికి వినతి



వినతిని అందజేస్తున్న కెవిపిఎస్ నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలను తక్షణమే విడుదల చేయాలని, అర్హులైన చర్మకారులకు బడ్డీ షాపులు, పనిముట్లు ఇవ్వాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఆధ్వర్యాన మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కేంద్ర ప్రభుత్వ పథకాలు, షెడ్యూల్ కులాల అభ్యర్థులు అవగాహన సదస్సులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటికి కెవిపిఎస్ జిల్లా నేతలు కార్పొరేషన్ రుణాలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతి బాబు మాట్లాడుతూ జిల్లాలో గతంలో దరఖాస్తు చేసుకున్న యువతకు బ్యాంకర్లు ఇబ్బందులు పెట్టకుండా ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నారు. చర్మకారులకు పనిముట్లు, బడ్డీ షాపులకు ప్రత్యేక రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 5 ఏళ్ల నుంచి నిరుద్యోగ యువత స్వయం ఉపాధి నిమిత్తం ఎలాంటి రుణాలను మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు పక్క ప్రమాదకర స్థలాల్లో చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్న చర్మకారులకు పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్షం వస్తే తడుస్తూ, ఎండకు ఎండుతూ కుటుంబాన్ని పోషించుకోవడానికి ఎలాంటి ఆధారం లేకపోయినా రోడ్డు పక్కనే వృత్తి చేసుకుంటున్నారని, వారికి బడ్డీ షాపులు పెట్టుకోవటానికి సబ్సిడీ రుణాలను ఇవ్వాలన్నారు. దీనిపై స్పందించిన ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ముక్కంటి మాట్లాడుతూ కెవిపిఎస్ సంఘం ఇచ్చిన విజ్ఞప్తి చాలా ఉపయోగపడతాయని, ఈ విజ్ఞప్తులను వెంటనే రాష్ట్ర కార్పొరేషన్‌కి పంపిస్తామని, సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిన నాగేశ్వరరావు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోడదాసి గంగయ్య ఉన్నారు.

ఎస్ఆర్‌కెఆర్‌కు మూడు అవార్డులు గర్వకారణం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జాతీయ స్థాయిలోనే భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు మూడు అవార్డులు రావడం భీమవరం పట్టణానికే గర్వకారణమని భీమవరం హౌసింగ్ బోర్డ్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు కంతేటి వెంకటరాజు పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన బ్రెయినో విజన్ సంస్థ జాతీయస్థాయిలో ప్రకటించిన భారత్ ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డులలో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు ఓవరాల్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు, కళాశాల ప్రిన్సిపల్‌కు లీడర్షిప్ ఇన్నోవేషన్ ప్రోత్సహించటంలో భీష్మాచార్య అవార్డు, హ్యాకథాన్ వంటి జాతీయస్థాయి పోటీలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించటంలో ఐటి విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఐ.హేమలతకు ఉత్తమ అధ్యాపకురాలు అవార్డు లభించడం పట్ల శ్రీవిజ్ఞాన వేదిక సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజులు,



అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణమరాజు, ఐటీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఐ.హేమలత, కళాశాల చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిహెచ్.దిలీప్ చక్రవర్తులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ మాట్లాడుతూ భీమవరం పట్టణ ప్రముఖులు, ప్రజలు అందిస్తున్న సహాయ సహకారాలతో కళాశాలను అత్యున్నత విద్యా ప్రమాణాలతో జాతీయస్థాయి విద్యా సంస్థగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

ఎస్ఆర్‌కెఆర్ ఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజశ్రీకి డాక్టరేట్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటి) డిపార్ట్మెంట్‌కి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.తేజశ్రీ విజయవాడలోని కెఎల్ యూనివర్సిటీ నుండి డాక్టర్ పొందారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. బుధవారం కళాశాలలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో డాక్టరేట్ అందుకున్న బి.తేజశ్రీని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ యాజమాన్యం తరపున ఘనంగా సత్కరించారు. 'యాన్ ఎఫిషియెంట్ మెట-హ్యూరిస్టిక్ ఆప్టిమైజేషన్ ఫ్రేమ్ వర్క్ ఫర్ మొబైల్ ఎడ్జ్ షెడ్యూలింగ్' అనే అంశంపై తాను చేసిన పరిశోధనకు గాను కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్(కెఎల్ యూనివర్సిటీ), వడ్డేశ్వరం వారు డాక్టరేట్ ప్రదానం చేశారని తేజశ్రీ పేర్కొన్నారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అంతర్ జిల్లా చైన్ స్నాచింగ్, మోటారు సైకిల్స్ చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మోటారు సైకిళ్లు, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో చోరీలకు పాల్పడుతున్న నేరగాళ్లను చాకచక్యంగా పట్టుకున్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్‌పి కొమ్మి ప్రతాప్ శివకిషోర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్‌పి సక్కా సూర్యచంద్రరావు, ఏలూరు డిఎస్‌పి శ్రావణకుమార్ ఉన్నారు.

ఎస్‌పి ఆదేశాలపై ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో నిడమర్రు సిఐ ఎన్.రజనీకుమార్ ఆధ్వర్యంలో చేబ్రోలు ఎస్ఐ ఎం.సూర్యభగవాన్, నిడమర్రు ఎస్ఐ ఎస్ఎన్‌వి రమేష్, గణపవరం ఎస్ఐ ఎ.మణికుమార్, భీమడోలు ఎస్ఐ ఎస్‌కె మదీనా భాషా చోరీ కేసులను ఛేదించటంలో తమ ప్రతిభను చాటుకున్నారు. చేబ్రోలు, నిడమర్రు, గణపవరం, భీమడోలు, తణుకు టౌన్, తణుకు రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో స్నాచింగ్, మోటారు సైకిల్స్ దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను బుధవారం మధ్యాహ్నం ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామశివారు మురుక్కోడు పంతెన, పత్తేపురం వైపు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.3.70 లక్షల విలువైన నాలుగు మోటారు సైకిళ్లు, స్నాచింగ్ కేసుల్లో అపహరించిన రూ.6.50 లక్షల విలువైన బంగారు నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆకివీడు ఎస్‌బిఐ బ్యాంకు నుంచి 38.8 గ్రాముల బంగారు నగలు రికవరీ చేయాల్సి ఉంది.

ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం కోళ్లపర్రు గ్రామానికి చెందిన తాటిపర్తి రాముడు, నక్క వెంకటేష్, తాటిపర్తి దుర్గారావు, ఉండిపుండలం అర్తమూరు గ్రామానికి చెందిన గండికోట నాగరాజు, అత్తిలి మండలం ఎర్రనేలగుంట గ్రామానికి చెందిన ఆసెట్టి నాగేష్ అనే నిందితులను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. రాముడుపై 11 కేసులు, దుర్గారావుపై 19 కేసులు, నాగరాజుపై 3 కేసులు, నాగేష్‌పై 14 కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే ఉపేక్షించం : కలెక్టర్

భీమవరం : గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలో గర్భస్థ శిశులింగ నిర్ధారణ, నివారణ చట్టం అమలుపై సంబంధిత కమిటీ సభ్యులతో సమీక్షించారు. నాగరిక సమాజంలో ఆడ, మగ తారతమ్యం లేదని అన్నారు. పురుషుల కంటే దీటుగా మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉన్నారని తెలిపారు. ఇటువంటి పరీక్షలు చేసినట్లు తెలిస్తే తీవ్ర కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. 97 ఫారం-ఎఫ్ రిపోర్టులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. భీమవరం, నరసాపురం డివిజన్లో 30 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇవే కాకుండా జూలై నుండి అక్టోబర్ వరకు స్కానింగ్ సెంటర్స్ 178 సాధారణ తనిఖీలను నిర్వహించడం జరిగిందన్నారు. భీమవరంలో డివిజన్లో 81, నరసాపురం డివిజన్లో 80 మొత్తం జిల్లాలో 161 స్కానింగ్ సెంటర్ లు పనిచేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, కమిటీ మెంబర్స్ సెక్రటరీ డాక్టర్ బి.గీతాభాయ్, మెంబర్లు జిల్లా అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ ఎంఎస్‌విఎస్.బద్రిరాజ్, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ వివిఎస్ఆర్‌కె.కుమారి, ఎజె సంధాని పాల్గొన్నారు.

కలప అక్రమ రవాణా అడ్డగింత

నరసాపురం : అక్రమంగా తరలిస్తున్న కలపను కూటమి నాయకులు అడ్డుకున్నారు. మండలంలోని సీతారాంపురం సౌత్‌లోని రామన్నపాలెం పంట కాలువను ఆనుకుని ఎన్నో ఏళ్లుగా పెరిగి పెద్ద వృక్షాల్లా ఉన్న సర్వీ, జామాయిల్ చెట్లు ఉన్నాయి. ఇటీవల ఏర్పడిన మొంథా తుపాను ప్రభావానికి నేల మట్టమయ్యాయి. కొందరు వ్యక్తులు చెట్లను బుధవారం మిషన్లతో ముక్కలుగా నరికి ట్రాక్టర్లపై ఎగుమతి చేసి తరలించేందుకు సిద్ధమవుతుండగా కూటమి నాయకులు కొండేటి వేంకటేశ్వరస్వామి(త్రినాథ్), మారుబోయిన శ్రీనివాస్, రావి వీరాస్వామి, రావి వెంకటరత్నం, కూనపరెడ్డి ఏసు తదితరులు చెట్ల కలప తరలించేందుకు అభ్యంతరం చెప్పి అడ్డుకున్నారు. చెట్లను ముక్కలుగా నరికి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పడిపోయిన చెట్ల కలపను నిబంధనల మేరకు బహిరంగ వేలం వేయాలన్నారు. కలప వేలం పాటకు సంబంధించిన వివరాలు, నిబంధనలు గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. నిబంధనలు పాటించకుండా చెట్లను అధికారులు ఏకపక్షంగా ఎవరికో కట్టబెట్టారని కూటమి నాయకులు ఆరోపించారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని విమర్శించారు. గ్రామంలోని ఓ రాజకీయ పార్టీ నాయకుడు జోక్యంతోనే అధికారులు ఈవిధంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. తుపానుకు కూలిన 60, 70 ఏళ్ల నాటి జామాయిల్, సర్వీ చెట్లు 30 పైగా ఉంటాయని, వాటి విలువ సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుందన్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదని, గ్రామంలో అందరికి సమాచారం ఇచ్చిన తర్వాతే నిబంధనల మేరకు కూలిన చెట్లను జలవనరులశాఖ అధికారులు వేలం పాట నిర్వహించేవారని గుర్తు చేశారు. కూలిన చెట్లను వేలం పాట నిర్వహించి ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నేరాలు - ఘోరాలు

గోదావరిలో వ్యవసాయ కూలీ గల్లంతు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని కరుగోరుమిల్లి వశిష్ట గోదావరిలో వ్యవసాయ కూలీ గల్లంతైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కరుగోరుమిల్లి పంచాయతీ పరిధి నెల్లివారి పేట గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ ఇంజేటి పెద్దిరాజు(58) పశువులను కడగటానికి దిగి బుధవారం ఉదయం 11:30 సమయంలో గోదావరిలో గల్లంతు కావడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. పెద్దిరాజుకు ముగ్గురు కుమారులు కలరు. భార్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలిపారు. పెద్దిరాజు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ ఒక గేదె, ఒక దూడను కుటుంబానికి ఆసరాగా మేపుకుంటున్నాడు. ఈ తరుణంలో బుధవారం ఉదయం వశిష్ట గోదావరి వద్దకు తమ పశువులను తోలుకుని వచ్చారు. ఈ నేపథ్యంలో దూడ గోదావరి నది లోపలికి వెళ్తున్న తరుణంలో దాని తోక పట్టుకోవడంతో గోదావరి ఉధృతికి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మత్స్యకారుల సహాయంతో వలలతో గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటన్నర సమయంలో గోదావరిలో సుమారు కిలోమీటర్ దూరంలో పెద్దిరాజు మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. పశువులను కడుక్కొని వస్తానని కొడుకులకు చెప్పి వెళ్లిన తండ్రి చివరకు శవంగా మారడంతో కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో రోదించారు. విఆర్‌ఒ కె.బాలాజీ మృతదేహానికి పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.వెంకటరమణ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

తప్పిన పెను ప్రమాదం

కుక్కునూరు : మండల పరిధిలోని దామరచర్ల గ్రామంలో విద్యుదాఘాతంతో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో అలివేలు అనే మహిళకు చెందిన ఇల్లు దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది త్వరగా స్థలానికి చేరుకొని మంటలను సమర్థవంతంగా అదుపులోకి తీసుకున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా కుటుంబ సభ్యులంతా గుడికి పాలు పోసేందుకు వెళ్లిపోవటంతో పెను విపత్తు తప్పింది. ఈ ఘటనలో సుమారు రూ.2 లక్షల విలువైన ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడికి రిమాండ్

కుక్కునూరు : చీరవల్లి గ్రామంలోని పేరంటాలమ్మ ఆలయ హుండీని ఈనెల 3వ తేదీ రాత్రి అపహరించిన కేసులో పోలీసులు త్వరితగతిన స్పందించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. వేలేరుపాడు మండలం కమ్మరిగూడెం గ్రామానికి చెందిన కారం సాంబయ్యను అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు పంపారు. గతంలో అతడిపై మొత్తం 8 దొంగతనం కేసులు నమోదయ్యాయని కుక్కునూరు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

ప్రేమించిన యువతి అన్నపై దాడి

పోడూరు : ప్రేమ వ్యవహారంలో యువతి అన్నపై దాడి చేసి గాయపరచిన ఘటన వద్దిపర్రు గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వద్దిపర్రు గ్రామానికి చెందిన చిలకలపూడి కేశవ్ అదే గ్రామానికి చెందిన ఒక యువతిని ప్రేమిస్తున్నాడు. యువతి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు దీనిపై కొంతకాలంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మంగళవారం సాయంత్రం యువతి అన్న పరుచూరి సూరిబాబు(30) మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా కేశవ్ తండ్రి మసేనరావు మోటార్ సైకిల్‌పై వెళ్లి అతనిని వెంబడించి ఢీకొట్టాడు. తనపై దాడి చేస్తారనే భయంతో వెంటనే సూరిబాబు సమీపంలో చేపల చెరువుల వైపు పరిగెడుతుండగా మసేనరావు, అతని కుటుంబ సభ్యులు, మరికొందరు సూరిబాబును వెంబడించి దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై బాధితుడు సూరిబాబు ఫిర్యాదు మేరకు చిలకపూడి మసేనరావు, సరోజిని, కేశవ్, కొల్లా ప్రసాద్, కొల్లా శ్రీనివాస్, కొల్లా లక్ష్మితో పాటు మరో 10 మందిపై స్థానిక ఎస్ఐ సుధాకర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడి ఘటనలో గాయపడిన సూరిబాబు పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో పల్టీ : ఇరువురికి గాయాలు

ముదినేపల్లి : ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టిన ఘటనలో ఇరువురికి గాయాలైన సంఘటన బుధవారం ముదినేపల్లి సమీపంలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం గుడివాడ నుంచి ముదినేపల్లి వైపు వస్తున్న ప్రయాణికుల ఆటో స్థానిక పోల్ రాజు డ్రెయిన్ సమీపంలో అదుపుతప్పి పంట పొలాల్లోకి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇరువురు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్సకై గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

క్షీరపురిలో నేషనల్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌తో ప్రపంచ కీర్తి

ప్రారంభోత్సవంలో మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

కలలకు, కళాకారులకు పుట్టినిల్లు అయిన పాలకొల్లు (క్షీరపురి) కీర్తి అల్లూరి సీతారామరాజు నేషనల్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుతో ప్రపంచ వ్యాప్తంగా పొందుతుందని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో నూతనంగా ప్రారంభించిన అల్లూరి సీతారామరాజు నేషనల్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ కార్యక్రమంలో మంత్రి పాల్గొని పూజలు చేశారు. మాజీ మంత్రి చేగొండి వెంకట హరిరామ జోగయ్య, సంస్థ గౌరవాధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ తదితరుల నేతృత్వంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర రంగంలో పాలకొల్లుకు ఓ ప్రత్యేక స్థానం ఉందని, ఈ కళామతల్లి గడ్డపై నుంచే అల్లు రామలింగయ్య, దాసరి నారాయణరావు, కోడి రామకృష్ణ, రేలంగి నరసింహారావు, ఎస్‌ఎస్.రవిచంద్ర, రవి రాజా పినిశెట్టి, చేగొండి అనంత శ్రీరామ్ తదితరులు ఎందరో సినీ ప్రముఖులు రాణించారన్నారు. అటువంటి ఈ ప్రాంతంలో నేషనల్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు కావడం అభినందనీయమని నిర్వాహకులను ప్రత్యేకంగా ప్రశంసించారు. రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రప్రదేశ్‌లో పర్యాటక పరంగా అభివృద్ధి చెందేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, అటువంటి పరిశ్రమ పాలకొల్లుకు రావడం ఎంతోమందికి శిక్షణ ఇచ్చే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సినిమా షూటింగ్‌లకు వెళ్లాలంటే ఊటీ, కొడైకెనాల్ వంటి ప్రాంతాలకు వెళ్లేవారని, నేడు అక్కడ జనం పెరుగుతుండటంతో పాటు కాలుష్య వాతావరణం ఏర్పడిందన్నారు. సినిమా షూటింగ్‌లకు సహజ సిద్ధమైన గోదావరి తీర ప్రాంతంతో పాటు కోనసీమ అందాలు ఎంతగానో ఉపయోగపడడంతో పాటు సినీ ఖర్చు తగ్గుతుందన్నారు. ప్రభుత్వం ఈ ప్రాంతంలోని అంతర్వేది, శ్రీ వాడపల్లి, పంచారామ క్షేత్రాలైన క్షీర రామలింగేశ్వర స్వామి తదితర ఆలయాలను పర్యాటక పరంగా అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించిందన్నారు. ఈ ఫిలిం ఇనిస్టిట్యూట్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి రామానాయుడు ఆకాంక్షించారు. మాజీ ఎంపీ జోగయ్య మాట్లాడుతూ పాలకొల్లులో ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుతో నా కల తీరిందని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇనిస్టిట్యూట్ వివరాలను వెల్లడించారు. ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు పెద్ద మనసుతో సహకరిస్తున్న జోగయ్య, గాంధీ భగవాన్ రాజులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ మాట్లాడుతూ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తున్నారు. మాజీ ఎంపిటిసి అంగర రామ్మోహన్, సినీ దర్శకుడు రాజా వన్నెంరెడ్డి, బోనం నరసయ్య, వి.వెంకటరమణ, చవ్వాకుల సురేష్, కలిదిండి గణపతిరాజు, వీర పోతన, సుధీర్, గుడాల హరిబాబు, ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్, మారంపూడి ఉదయ్, బండెల భాస్కరరావు, పలువురు కళాకారులు పాల్గొన్నారు.




ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ప్రారంభోత్సవంలో మంత్రి నిమ్మల, మాజీ మంత్రి జోగయ్య తదితరులు

ఎస్ఎస్ఎ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

10న కలెక్టరేట్ వద్ద ధర్నా - జిల్లా సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల జెఎసి పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

సర్వశిక్ష కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల జెఎసి డిమాండ్ చేసింది. ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, వేతనాలు పెంచాలని, రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈ నెల 10వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చింది. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బావాజీ అధ్యక్షతన జిల్లా సమావేశం బుధవారం నిర్వహించారు. రాష్ట్ర జెఎసి ఇచ్చిన పిలుపులో భాగంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు జరిగే ధర్నాలో జిల్లాలోని సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జనార్ధన్ మాట్లాడుతూ గత 22 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎన్నికల ముందు ఆనాటి ప్రతిపక్ష పార్టీలు ఇచ్చిన హామీలు ఎప్పటి వరకూ అమలు చేయలేదని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా కాంటాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగులందరికీ గ్రాడ్యూటీ చెల్లించాలని, మినిమం టైం స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ గత సమ్మె సమస్యలు తాము పరిష్కరిస్తామని పెద్ద ఎత్తున ఉపన్యాసాలు చేసిన కూటమి పార్టీలు కనీసం ఉద్యోగుల సమస్యలపై ఇంతవరకూ మంత్రి చర్చలు జరపకపోవడాన్ని తప్పుపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎస్-ఎస్‌సి ఉద్యోగుల సమస్యల పట్ల చొరవ చేయకపోతే డిసెంబర్ 10న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మేరీ, సంతోషి, రమేష్, శ్రీనివాసరాజు, సువర్ణరాజు, సిహెచ్ వెంకటేశ్వరరావు, ఎస్.బాలాజీ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జెఎసి నేతలు

మొగల్తూరులో వర్షం

ప్రజాశక్తి - మొగల్తూరు

వాతావరణ మార్పులతో మండలంలోని గ్రామాల్లో బుధవారం వర్షం కురిసింది. భారీ గాలులతో వర్షం కురిసింది. గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రమాదాల బారిన పడతామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారులపై వర్షపు నీరు నిలిచి చెరువులను తలపించాయి.

పోరాటాల ముద్దుబిడ్డ చింతకాయల బాబూరావు

సిఐటియు నేతల నివాళి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పోరాటాల ముద్దు బిడ్డ చింతకాయల బాబూరావు మృతి తీరని లోటు అని సిఐటియు నేతలు చల్లా చంద్రరావు, సిరపరపు రంగారావు అన్నారు. తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్, ఉల్లిపాయలు మార్కెట్ యూనియన్ కార్యాలయం వద్ద బుధవారం ఆయన చిత్రపటానికి వారు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో కారక వెంకట్రావు, సిరపు గణేష్, బేతా అప్పారావు, సలమూరి సత్యనారాయణ, గోర్ల రమేష్, సిరప్ మహేష్, బర్ల బాలాజీ, దౌర్ల సీతయ్య, వెన్నెల శ్రీను, గంటా కోటి, చీర వెంకన్న, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇటుకల గుంటలో

ఇటుకుల గుంట గ్రామంలో బుధవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో చింతకాయల బాబూరావు సంతాప సభ నిర్వహించారు. తొలుత బాబూరావు చిత్రపటానికి సిపిఎం మండల కన్వీనర్ పాలుపూరి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణతోపాటు మండల నాయకులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ మండలంలో పార్టీ అభివృద్ధికి, ప్రజాసంఘాల అభివృద్ధికి బాబూరావు నిరంతరం పరితపించేవారన్నారు. ఆయన లేని లోటు ఉద్యమానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో పాలుపూరి సత్యవతి, బంకూరు యశోద, పాలుపూరి శ్రీనివాసు, మల్లిపూడి సీతామహాలక్ష్మి, పి.పుష్ప, ఎల్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ సోషలిజానిదేనని నిరూపించిన న్యూయార్క్

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

న్యూయార్క్ డిప్యూటీ మేయర్ గెలుపుపై సిపిఎం హర్షం

ప్రజాశక్తి - భీమవరం

భవిష్యత్ సోషలిజానిదేనాని న్యూయార్క్ నగర ప్రజానీకం నిరూపించారని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్‌లో అమెరికాలో న్యూయార్క్ నగర ఎన్నికల్లో సోషలిస్టు అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీ గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ అమెరికా పెట్టుబడిదారి సామ్రాజ్యవాదంపై విసిగెత్తిపోయిన ప్రజానీకం సోషలిస్టు నేత డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీ 50 శాతానికిపైగా ఓట్లతో విజయం ఒక తార్కాణం అన్నారు. ఇది గొప్ప విజయం అన్నారు. ఇది ట్రంప్‌నకు చెంప పెట్టు అన్నారు. బడా కార్పొరేట్లపై న్యూయార్క్ ప్రజలు సాధించిన విజయమని, ట్రంప్ కుట్రలను, కుతంత్రాలను, బెదిరింపులను ఎదిరించి గెలిచారన్నారు. అమెరికా గడ్డ మీద ఒక సోషలిస్టు భావాలు కలిగిన అభ్యర్థి విజయం సాధించడం చారిత్రాత్మకం అన్నారు. జోహ్రాన్ మమ్దానీ ఎన్నికల్లో పోటీచేస్తే ఎన్నో ఆంక్షలు, బెదిరింపులకు, దుష్ప్రచారాలకు ట్రంపు దిగినా 34 ఏళ్ల యువకుడు మమ్దానీ వెనకడుగు వేయలేదన్నారు. న్యూయార్క్ ప్రజానీకం జోహ్రాన్ మమ్దానీ వెనుక నిలబడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ, కె.క్రాంతిబాబు, మామిడిశెట్టి రామాంజనేయులు, ఇంజేటి శ్రీను, మల్లిపూడి ఆంజనేయులు, ఎం.వైకుంఠరావు, టి.ప్రసాద్, సాయి, సింధు, ప్రణీత్, కృష్ణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, వేంద్ర సత్యనారాయణ పాల్గొన్నారు.



ప్రదర్శనలో నినదిస్తున్న సిపిఎం నేతలు, కార్యకర్తలు

రేపు అమరజీవి బాబూరావు సంస్మరణ సభ

తాడేపల్లిగూడెం: కార్మిక నేత, అమరజీవి చింతకాయల బాబూరావు సంస్మరణ సభ ను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటేన విడుదల చేశారు. సంస్మరణ సభ ఈనెల 6వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు మార్కెట్‌లో బైపాస్ రోడ్డు కాపు కళ్యాణ మండపంలో జరుగుతుందని, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్, టీచర్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, సిపిఎం, కార్మిక నేతలు, ప్రముఖులు, కుటుంబ సభ్యులు హాజరవుతారన్నారు.



మాట్లాడుతున్న గంటా త్రిమూర్తులు

బిసి కార్పొరేషన్ నిధుల విడుదల

కృష్ణబలిజ పూసల వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గంటా త్రిమూర్తులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బిసి కార్పొరేషన్, ఆదరణ పథకం కింద ప్రభుత్వం 1000 కోట్ల నిధులు విడుదల చేసినట్లు కృష్ణబలిజ పూసల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గంటా త్రిమూర్తులు తెలిపారు. బుధవారం విజయవాడ గొల్లపూడిలోని బిసి సంక్షేమ భవన్‌లో నేడు వివిధ బిసి గ్రూపుల సమస్యలు, అభ్యున్నతి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం జరిగిందన్నారు. ఈ సమావేశానికి బిసి సంక్షేమ, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం, జౌళి, వస్త్ర పరిశ్రమ శాఖ మంత్రి ఎస్.సవితమ్మ అధ్యక్షత వహించగా తాను పలు సమస్యలను బిసిల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలను, ప్రభుత్వం అందిస్తున్న సంఖ్యా పథకాలపై మాట్లాడటం జరిగిందని తెలిపారు. కార్యక్రమానికి బిసి కార్పొరేషన్ నుండి అన్ని కులాలకు సంబంధించిన చైర్మన్లు హాజరయ్యారన్నారు.

మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్

ప్రజాశక్తి - నరసాపురం

తీర ప్రాంత మత్స్యకారులతో పాటు ఇతర మండల గ్రామాల మత్స్య కారులను ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలని మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం నరసాపురం రెవెన్యూ డివిజన్ అధికారిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం మొంథా తుపాన్ సహాయ చర్యల్లో భాగంగా చేనేత, మత్స్యకారులను బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు ఇచ్చి ఆదుకుందని, కాకపోతే కొన్ని కుటుంబాలకు పరిమితం చేయడం సరైంది కాదన్నారు. మత్స్య కారులు తీర ప్రాంతాలలోనే కాకుండా ప్లేన్ ఏరియా గ్రామాలలో వృత్తి చేసుకుంటూ ఉన్న వారిని సహాయం అందించడంలో విస్మరించారని అన్నారు. తుపాను సహాయం వారికి కూడా అందించాలని కోరారు. తుపాను కారణంగా అన్ని వృత్తిదారులు పనులు కోల్పోయి ఇబ్బంది పడ్డారని, వారికి కూడా సహాయం అందించాలని కోరారు. పేటల్లో దళితులు, వ్యవసాయ కూలీలు పనులు కోల్పోయి ఇబ్బంది పడ్డారని, వారిని ఆదుకోవాలని కోరారు. తుపాను సహాయ చర్యల్లో ప్రభుత్వం రాజకీయ లబ్ధి చూడకుండా విరివిగా అందించాలన్నారు. దానికోసం బాధితుల లిస్ట్ తయారీకి ప్రభుత్వం ముందుకు రావాలని రాజగోపాల్ కోరారు. మత్స్య కార్మిక సంఘ కన్వీనర్ జల్లి రాము మాట్లాడుతూ పంట కాల్వలు, బోధులలో వృత్తి చేసుకునే మత్స్యకారులను కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. సిఐటియు మండల కోఆర్డినేటర్ జవ్వాది తిరుమాని శ్రీనివాస్, పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతిని అందజేస్తున్న నేతలు

మాతా శిశు మరణాలు సంభవిస్తే చర్యలు : కలెక్టర్

భీమవరం : జిల్లాలో మాతృ, శిశు మరణాలు సంభవిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన మాతృ, శిశు మరణాలపై సంబంధిత కమిటీ సభ్యులతో సమీక్షించారు. జిల్లాలో మాతృ, శిశుమరణాలు జరగకూడదనే లక్ష్యంతో పనిచేయాలని ఆదేశించినా, ప్రతినెలా ఒక మరణం నమోదు కావడంపై ఆవేదన వ్యక్తం చేశారు. గత సమావేశంలో సమీక్షించిన సందర్భంలో మాతృ, శిశు మరణాలకు కారణమైన కొన్ని ప్రయివేటు ఆసుపత్రులపై తీసుకోమన్న చర్యలు ఏమయ్యాయని వైద్య శాఖ అధికారిని ప్రశ్నించారు. 2025-26 సంవత్సరం రెండో క్వార్టర్‌లో జరిగిన ఒక మాతృ మరణం, రెండు శిశు మరణాలకు గల కారణాలను సుదీర్ఘంగా సమీక్షించారు. బాధిత కుటుంబ సభ్యులతో కూడా స్వయంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ కేసుల్లో చివరి వరకూ వేచి చూడకుండా గర్భం దాల్చిన నాటి నుండే ఎక్కువ జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ మెంబర్ కన్వీనర్, డిఎంహెచ్ఒ బి.గీతాబాయి, కమిటీ మెంబర్లు డిసిహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, డిఐఒ డాక్టర్ దేవ సుధాలక్ష్మి, భీమవరం ఏరియా హాస్పటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవి కళ్యాణి, డాక్టర్ స్వర్ణకుమారి పాల్గొన్నారు.

కొనసాగిన కోటి సంతకాల సేకరణ

పెనుమంట్ర : మండలంలోని జుత్తిగ తదితర గ్రామాల్లో మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ జరిగింది. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని వెంటనే ఆపాలని కోరారు. 1966 తరువాత ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, హాస్పిటల్స్ ఏమి రాలేదని, 2004లో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన డాక్టర్ వైస్.రాజశేఖర్ రెడ్డి శ్రీకాకుళం నుండి చిత్తూరు వరకు 4 మెడికల్ కాలేజ్‌లు, తెలంగాణలో 5 కాలేజ్‌లు తీసుకొచ్చారని తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే డీలర్లపై చర్యలు

నరసాపురం : అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే నిత్యావసరాలు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఐవివి.సత్యనారాయణ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు రేషన్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఆలయంలో అఖండ జ్యోతి

ఆచంట : ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీఉమా రామేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం కర్పూర జ్యోతి(అఖండ జ్యోతి) ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గొడవర్తి కుటుంబానికి చెందిన గొడవర్తి వెంకటేశ్వర స్వామి(వెంకన్న బాబు) దంపతులు జ్యోతిని వెలిగించారు. వివిధ ప్రాంతాల నుంచి యాత్రికులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నెక్కంటి గజేశ్వరరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ పర్యవేక్షించారు.

మొదటి పేజీ నుంచి తరువాయి..

టెట్.. టెర్రర్..

నిబంధన విధించడం.. ఉపాధ్యాయుల్లో ఆందోళనకు కారణమైంది. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం ఐదేళ్లకు పైబడి ఉద్యోగకాలం ఉన్న టీచర్లంతా రెండేళ్ల వ్యవధిలో టెట్ రాసి ఉత్తీర్ణులు కావాల్సిందే. అలా ఉత్తీర్ణత కాకపోతే ఉద్యోగంలో కొనసాగింపుపై ఉపాధ్యాయుల్లో డైలామా నెలకొంది. ప్రస్తుతం జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం ఇన్ సర్వీస్ టీచర్లు కచ్చితంగా డిసెంబరులో టెట్ రాయాల్సిందేనని ఆదేశాలెక్కడా లేవని, ఒక అవకాశం కల్పించినట్టుగా మాత్రమే భావించాలని విద్యా శాఖ వర్గాలు చెబుతున్నాయి.

ఇన్ సర్వీసు ఉపాధ్యాయులను మినహాయించాలి

పిఎస్.విజయరామరాజు, ఫ్యాప్టో జిల్లా చైర్మన్

గతంలో డిఎస్‌సి నిబంధనలకు అనుగుణంగా పరీక్షలు రాసి ఉత్తీర్ణులై ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు ఆ తర్వాత అనేక పర్యాయాలు శిక్షణ కూడా పొందారు. ఈ నేపథ్యంలో ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. ప్రభుత్వం ఈ మేరకు సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేయాలి. ఆన్‌లైన్ శిక్షణలతో ఇప్పటికే టీచర్లు సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో గతంలో టెట్ రాయని వారు టెట్ ఉత్తీర్ణత సాధించాలని సుప్రీంకోర్టు తీర్పుతో సీనియర్లు, మహిళా ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది.

టెట్ వల్ల ఉపయోగం లేదు

జి.ప్రకాశం, ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్

రైట్‌టు ఎడ్యుకేషన్ యాక్ట్ 2009 ప్రకారం, 2011 ముందు టెట్ ఎలిజిబిలిటీ టెస్ట్ అమల్లో లేదు. టెట్ అమల్లోకి రాకముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన ప్రతి ఉపాధ్యాయుడూ టీచర్ ట్రెయినింగ్ అయ్యి, డిఎస్‌సి ఉత్తీర్ణత పొందిన తర్వాత ఇంటర్వ్యూలో కూడా ఉత్తీర్ణత సాధించి ఉద్యోగంలో చేరారు. ఏటా వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు వృత్త్యాంతర శిక్షణలు కూడా ఇస్తున్నారు. ఇన్ని శిక్షణలు పూర్తయిన తర్వాత ఈ టెట్ వల్ల ఉపయోగం లేదు.

ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి

ఎన్ .శ్రీనివాసరావు, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

ఉపాధ్యాయ శిక్షణ పొంది, డిఎస్‌సిలో ఉత్తీర్ణత సాధించి నియామకం పొందిన తర్వాత గత 25 నుంచి 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారు మళ్లీ టెట్ పరీక్ష ఉత్తీర్ణత కావాలనడం సరికాదు. దీని నుంచి మినహాయించడం పూర్తిగా ప్రభుత్వం బాధ్యత. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నిరసన విజయవంతం చేయాలి

ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఆర్.వి.ఎస్ సాయి వర్మ

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ పాసవ్వాలనే నియమం గురించి ఎస్‌టియు అనుబంధంగా ఉన్న జాతీయ ఉపాధ్యాయ సంఘం ఎఐఎస్‌టిఎఫ్ ద్వారా సుప్రీంకోర్టులో ఇన్ సర్వీస్ టీచర్లకు మినహాయింపు ఇచ్చేవిధంగా అవసరమైన రివ్యూ పిటీషన్ వేశాం. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఈ రివ్యూ పిటీషన్ వేయాలని ఎస్‌టియు తరపున ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేశాం. కేంద్ర ప్రభుత్వం ద్వారా అవసరం మేరకు చట్టసభల్లో మార్పు తెచ్చేందుకు కేంద్ర మంత్రులు ఎంపీలకు అన్ని జిల్లాల నుంచి ప్రాతినిధ్యం చేశాం. ఈనెల 13వ తేదీన న్యూఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనకు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలి.

టెట్ నిబంధన సరికాదు

రమణ, ఎపిటిఎఫ్ (1938) జిల్లా ప్రధాన కార్యదర్శి

విద్యాహక్కు చట్టం అమల్లోకి రాకముందు నియామకం పొందిన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి. ఉద్యోగంలో కొనసాగడానికి, ఉద్యోగోన్నతులకు కూడా టెట్ ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన సరికాదు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి.

ఎర్రజెండా అండతోనే భూ పోరాటాలు సాధ్యం

కోసం పెద్దఎత్తున ఆందోళన చేసి విజయవంతం సాధించడంలో సంఘం జిల్లా కమిటీ ముందుందన్నారు. టి.నర్సాపురం మండలం కూడా ముందుందని, అందుకే జిల్లా మహాసభకు వేదికైందని ప్రశంసించారు. దళితులు, పేదలు ఏజెన్సీ ప్రాంతంలో ఎర్రజెండా అండతోనే మనగడ సాధిస్తున్నారన్నారు. ఎర్రకాలువ ప్రాంతంలో వేలాది ఎకరాలు మిగులు భూములు ఎర్రజెండా అండతోనే పేదలు సాగు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో భూపోరాటాలకు ప్రత్యేకత ఉందన్నారు ఆ పోరాటాలను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందన్నారు. భారతదేశంలో మిలిటెంట్ పోరాటాల్లో అతి తక్కువ జిల్లాల్లో ఏలూరు జిల్లా ముందుందన్నారు. దోసపాడు ప్రాంతంలో అగ్రవర్ణ పెత్తందారుల చేతిలో ఉన్న వందల ఎకరాల అసైన్డ్ భూములను ఎర్రజెండా, వ్యవసాయ కార్మిక సంఘం ఆందోళనతో సాధించుకోగలిగామని, పేదలకు పంచగలిగామని అన్నారు. చంద్రబాబు పి4 విధానంతో పేదరికం నిర్మూలిస్తానని చెబుతూ పెద్దలకు పేదలను దత్తత ఇచ్చే కార్యక్రమం చేపట్టారని విమర్శించారు. దేశంలో పేదరికం లేని రాష్ట్రంగా ఎర్రజెండా రాష్ట్రం కేరళ ఉందన్నారు. నవంబర్ 1న నీతి ఆయోగ్ కమిటీ ప్రకటించిన రాష్ట్రం కేరళ నిలిచిందని చెప్పారు. భూములు పంచుతూ పట్టాలిచ్చి ఉద్యోగాలు కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం కేరళ అన్నారు. చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని చెబుతున్నారని, మోడీ విశ్వగురువుగా చెప్పుకుంటున్నాడని, అయితే వీళ్లు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. పేదలకు ఇవ్వడానికి భూములు లేవని చెబుతూ అదానీ, అంబానీలకు వేల ఎకరాలు దోచిపెడుతున్నారని, జిల్లాలో జీలుగుమిల్లి ప్రాంతంలో ఆయుధ డిపోకు, విశాఖలో గూగుల్ సంస్థ ఏర్పాటుకు వేల ఎకరాలు కేటాయించారని విమర్శించారు. అదానీ సంస్థలకు భూములు ఇవ్వడానికి రాష్ట్రంలో భూములు ఉన్నాయిగానీ పేదలకు ఇవ్వడానికి భూములు లేవని మండిపడ్డారు. భూసేకరణ చట్ట ప్రకారం కంపెనీలకు పనికిరాని గుట్టలు ఇవ్వాలని, అయితే గిరిజనులు పేదలు సాగు చేస్తున్న మూడు పంటలు పండే



గిరిజనుల నృత్య ప్రదర్శన

భూములను కేటాయిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. దేశంలో మోడీ అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. వేలల్లో జీతాలు తీసుకునే వారికి ఏ హాజరు లేదుగానీ ఉపాధి హామీ కూలీలకు పని సమయంలో మాత్రం రెండు పూటలా హాజరు పేరుతో వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వెంటనే హాజరు విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. ఉపాధి కూలీలకు రోజుకు కనీస వేతనం రూ.ఆరొందలు, ప్రతి కుటుంబానికీ ప్రతి యేటా 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం పోరాట స్ఫూర్తితో పేదలంతా ఐక్యం కావాలన్నారు. ప్రతి పేదవానికి రెండు ఎకరాలు భూమి పంచాలన్నారు. పేదలకు ప్రభుత్వం భూమి పంచుతుందా, లేదా ప్రభుత్వ భూములను ఆక్రమించి దున్నుకోమంటారా అని ప్రశ్నించడానికి ఈ మహాసభ ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు



అల్లూరి, భగత్ సింగ్ వేషధారణ

మాట్లాడుతూ దేశంలో సంపద సృష్టించేది, అందరికంటే ఎక్కువ కష్టపడేది వ్యవసాయ కార్మికులని, వారి రెక్కల కష్టంతోనే భూస్వాములు, పెత్తందారులు, పాలకులు కోట్లు గడిస్తున్నారని అన్నారు. అయితే కార్మికులు సోమరిపోతులని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వారి విమర్శలను తిప్పికొట్టాలంటే కార్మికులందరూ చైతన్యవంతులు కావాలని, ఎర్రజెండా పోరాటంలో ముందుకు సాగాలని అన్నారు. అధికారంలోకి రాకముందు పేదలకు భూములు పంచుతామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక భూస్వాముల కోసం పని చేస్తున్నారని, రాష్ట్రంలో ఒక్క ఎంఎల్ఎ కూడా పేదలకు ఒక ఎకరం పంచిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో పేదలకు రెండు లక్షల ఎకరాల భూములను పంచిన ఘనత వ్యవసాయ కార్మిక సంఘానికి దక్కుతుందన్నారు. మండలంలో ఎర్ర కాలువ మిగులు భూముల పోరాటాల్లో ఎదురైన అనేక పోరాటాల్లో అవాంతరాల్లో ప్రాణాలైనా ఇస్తాం.. భూములు కాపాడుకుంటామని సంఘం నాయకులు ముందుండి పోరాటం నడిపించారని అన్నారు. 598 జిఒతో అసైన్డ్ భూములు పెద్దలకు చెందేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. అగిరిపల్లి, దోసపాడు, పంగిడిగూడెం, టి.నరసాపురం ప్రాంతాల్లో పేదల చేతుల్లో ఉన్న భూముల జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. పేదలు సాగు చేస్తున్న భూముల కోసం ఎంతటి పోరాటాలకైనా సిద్ధమని, ఉంటే భూముల్లో లేదా జైల్లోనైనా ఉంటామన్నారు. పేదలకు భూమి పంచి వారికి ఆర్థిక వనరులను కల్పించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడుతూ కూలీలు, కార్మికులు ఐక్యంగా ఉంటేనే వారి సమస్యలు పరిష్కరించుకోగలుగుతారని, కూలి కోసం.. భూమి కోసం పోరాటం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తామా ముత్యాలమ్మ, జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, ఉపాధ్యక్షులు పి.సత్యనారాయణ, మహంకాళి, నాగదుర్గ, కొరసా వెంకటేష్, గుడెల్లి వెంకటరావు, వై.నాగేంద్ర, ఎం.సుధారాణి, ఎం.కుమారి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అండలూరు క్రీడాకారులు

ప్రజాశక్తి - వీరవాసరం

అండలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైయ్యారు. ఈమేరకు బుధవారం ఎంపికైన క్రీడాకారులు షేక్ షిలార్‌బిబి, బంటు అభినాష్‌లను ప్రధానోపాధ్యాయులు ఎంఎన్‌వి.పెద్దిరాజు, క్రీడా ఉపాధ్యాయుడు పంతకాని శ్రీనివాస్, విద్యాకమిటీ ఛైర్‌పర్సన్ తమ్మినీడి రమాదేవి, క్రీడ ఉపాధ్యాయుడు పంతకాని శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఈనెల 4న ఎపి సాంఘిక సంక్షేమ ఉన్నత పాఠశాల పెదవేగిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-14, 17 కేటగిరిలో వీరు రాష్ట్ర స్థాయికి ఎంపికైయ్యారు. సాఫ్ట్‌బాల్‌లో అండర్-14 విభాగంలో షేక్ షిలార్‌బిబి ఎంపికైంది. ఈమె ఈనెల 22, 23, 24 తేదీలలో వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందులలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటుంది. అలాగే బేస్‌బాల్ అండర్-17 విభాగంలో బంటు అభినాష్ ఎంపికవ్వడంతో ఈ నెల 27, 28, 29 తేదీలలో నంద్యాల జిల్లా అహోబిలంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటాడని ప్రధానోపాధ్యాయులు పెద్దిరాజు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రికి వీల్ చైర్ బహూకరణ

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ ఆసుపత్రికి భీమవరం బ్యాంక్ కాలనీకి చెందిన కొట్టి వెంకట ఆదినారాయణ ఒక వీల్ ఛైర్‌ను బుధవారం బహూకరించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణ్ జీతానంద్, ఫార్మసీ ఆఫీసర్స్ విష్ణు, ప్రసాద్ మాట్లాడుతూ రోగుల అవసరార్థం ఆసుపత్రికి వీల్ చైర్‌ను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువలో చెత్తాచెదారం తొలగింపు

ఉండి : గత రెండు రోజులుగా ఉండి పంట కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఇరిగేషన్ సిబ్బంది బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా డిసి ఛైర్మన్ తోట ఫణి, డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు మాట్లాడుతూ ఉండి ప్రధాన పంట కాలువ శివారు ప్రాంతానికి కూడా ఎటువంటి అవరోధం లేకుండా నీరు ప్రవహించాలని, ప్రతి ఒక్కరికీ సాగు, తాగునీరు ఇబ్బందులు లేకుండా అందించాలని స్థానిక ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు ఆదేశాల మేరకు పంట కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడం జరిగిందన్నారు. తమ సిబ్బందికి సహకరించిన గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ పంచాయతీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి ఉన్నారు.

న్యూజిలాండ్ పర్యటనలో ఎంఎల్ఎ రాధాకృష్ణ

తణుకు : తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ న్యూజిలాండ్ పర్యటనలో ఉన్నారు. బుధవారం ఉదయం ఆయన న్యూజిలాండ్ ఎయిర్‌పోర్టుకు చేరుకోగా, ప్రవాస ఆంధ్రులు ఘనంగా స్వాగతం పలికారు. మద్దుకూరి దిలీప్, గోరంటాల అశోక్, నిమ్మగడ్డ జితేంద్ర, గారపాటి మమత తదితరులు ఎంఎల్‌ఎను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన తణుకు నియోజకవర్గంలో, రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితులను వారికి వివరించారు. న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా ఎంఎల్ఎ ఈనెల 8, 9 తేదీల్లో జరిగే ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

చినుకు పడితే చిత్తడే..!

నడవడానికి తోవ కానరాని దుస్థితి
మురుగుతో ఏళ్ల తరబడి అవస్థలు
మౌలిక వసతుల లేమి
అధికారులు స్పందించాలని జగనన్న కాలనీ వాసుల వేడుకోలు

ప్రజాశక్తి - పెనుమంట్ర



మురుగు నీటిలో అవస్థలు పడుతున్న వృద్ధులు

చినుకు పడితే చాలు చిత్తడిగా మారిపోయి, నడవడానికి దోవ కానరాని విధంగా.. నిండిపోయిన మురుగుతో సంవత్సరాల తరబడి ఇబ్బంది పడుతున్నామని మండలంలోని పెనుమంట్ర పంచాయతీ పరిధిలో ఉన్న సూర్యారావు పేట జగనన్న కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా కష్టాలు పట్టించుకునే నాథుడే లేడంటూ.. పంచాయతీ అధికారుల ఉదాసీన వైఖరి విడనాడాలని వాపోయారు. పెనుమంట గ్రామంలోని సూర్యారావుపేట వాసులు రమణ కృష్ణమూర్తి, దంపనబోయిన సుగుణ, తేతలి లక్ష్మీ, తదితరులు ఈ కాలనీ పరిస్థితి గురించి వివరించారు. గత ప్రభుత్వంలోని పెద్దలు జగనన్న కాలనీ పేరిట ఇక్కడ సుమారుగా 30 స్థలాలు ఇవ్వగా అందులో 8 ఇల్లు నిర్మించుకొని కాపురాలు ఉంటున్నామన్నారు. సుమారుగా రెండు సంవత్సరాల నుండి మాకు పంచాయతీ కుళాయి గాని, కరెంటు స్తంభం గానీ, రోడ్డు గానీ లేవని, కనీస సదుపాయాలు కల్పించడంలో అధికారులు ఏం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ విషయంపై గ్రామపంచాయతీకి అనేక మార్లు మొరపెట్టుకున్నా.. పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఇటీవల పెనుమంట గ్రామ పంచాయతీ సెక్రెటరీ అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో ఇన్‌ఛార్జిగా వేరొక పంచాయతీ కార్యదర్శి రావడం జరిగిందని, ఆయనకి ఫోన్ చేసి పరిస్థితి వివరించగా చూస్తామన్నారు కానీ, ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు మొరపెట్టుకున్నారు. ఇక్కడ నివాసం ఉంటున్న తాము ఇల్లు అమ్ముకోవాలా, వేరే చోటుకి పోవాలో తెలీని నరకం అనుభవిస్తున్నామని వాపోయారు. ఇంటి నిర్మాణానికి అప్పులు తెచ్చుకుని, వడ్డీలు చెల్లించుకుంటూ కట్టుకున్న ఇళ్లకు సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ మొత్తం వర్షం వస్తే చెరువుని తలపించే విధంగా ఉందని, ఇక్కడ కరెంటు తీగలు ఎక్కడ తెగి నీటిలో పడతాయోనని భయభ్రాంతులకు గురవుతున్నామన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఇక్కడ కనీస సౌకర్యాలు లేకనే మిగిలిన వారు ఇల్లు నిర్మించుకోలేదని సంబంధిత గృహ నిర్మాణ, విద్యుత్ అధికారులు ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించకపోవడం దారుణం

సిపిఎం మండల కమిటీ సభ్యులు కె.సుబ్బరాజు

కనీస ప్రజా సమస్యలను అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ ఏళ్ల తరబడి పరిష్కరించకపోవడం దారుణం. పంచాయతీ పరిధిలో ఉన్న సూర్యారావు పేట జగనన్న కాలనీ పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ప్రజలకు కనీస వసతులను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. వెంటనే కాలనీలోని పరిస్థితులను అధికారులు చక్కదిద్దాలి.

పాడి పశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్స

ప్రజాశక్తి - గణపవరం



మాట్లాడుతున్న పశు వైద్యాధికారులు

పాడి పశువులలో గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసి, చూడి కట్టించి దాని ద్వారా పాల ఉత్పత్తి పెంచటమే పశువైద్యశిబిరం లక్ష్యమని పశువర్ధక శాఖ అధికారులు చెప్పారు. బుధవారం జల్లికొమ్మర రైతుసేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచి కురెళ్ల వెంకటరత్నం, టిడిపి నాయకులు కె.రాంబాబు, ఎం.మహాకాళి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎల్ కె.సుధాకర్ మాట్లాడుతూ లేగదూడల పోషణపై రైతులకు పలు సూచనలు చేశారు. లింగ నిర్ధారిత వీర్యం గురించి వివరించారు. శిబిరంలో 60 పశువులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. 38 గర్భకోశ పశువులకు, 28 పెద్ద పశువులకు, 50 లేగదూడలకు నట్టల నివారణ మందు తాగించారు. ఈ శిబిరంలో పశువర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ డిఎం నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పి.మహేష్, డాక్టర్ అశోక్ సునీల్, జి.సురేష్, ప్రవీణ్ కుమార్, ఫార్మ కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

చేనేతలకు అండగా కూటమి ప్రభుత్వం

మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్



నిత్యావసరాలు అందజేస్తున్న మంత్రి నిమ్మల, తదితరులు

మండలంలోని చింతపర్రు గ్రామంలో 250 చేనేత కుటుంబాలకు 50 కేజీల బియ్యం, 5 రకాల నిత్యావసర సరుకులను మంత్రి రామానాయుడు అందజేశారు. రాష్ట్రంలో చేనేత కార్మిక కుటుంబాలకు అన్ని విధాల ఆదుకునేలా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామంలో నష్టపోయిన చేనేత కార్మిక కుటుంబాలకు తుపాను సాయంగా 50 కేజీల బియ్యం, 5 రకాల నిత్యావసర సరుకులను కూటమి నాయకులతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ మంత్రివర్గ సమావేశంలో చేనేత కార్మిక కుటుంబాలను ఆదుకునేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు నిర్ణయం తీసుకున్నారని, వాటి అమలు దిశగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. చేనేత కార్మికులకు సంబంధించి పవర్‌లూమ్‌కు 500 యూనిట్లు, హ్యాండ్లూమ్‌కు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తున్నామన్నారు. జిఎస్‌టికి సంబంధించి ఐదు శాతంను కార్మికులకు అందేలా రియంబర్స్‌మెంట్ అందిస్తామన్నారు. ఏడాదికి 25 వేలు సహాయంగా అందించనున్నట్లు మంత్రి రామానాయుడు తెలిపారు. తుపానులో నష్టపోయిన కార్మిక కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతోనే పెద్ద ఎత్తున తుపాను సహాయాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ఎఎంసి యడ్ల దుర్గ కిషోర్, సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు, పాలకొల్లు మండల అధ్యక్షులు పాముల రజనీకుమార్, కలిదిండి రామచంద్రరాజు, వీరమల్లు శ్రీనివాసరావు, సాగ సత్యనారాయణ, పెనుమత్స శ్రీనివాసరాజు, ఇంటిశ్రీరాముడు, కామిశెట్టి రంగారావు, బోడపాటి వెంకటనారాయణ, వడ్డే సోమ చంద్రశేఖర్, అందే కోటి వీరభద్రం, వాస మల్లికార్జునరావు, వీరమల్లు శ్రీను, వాస వీరభద్రరావు, అందే నాగయ్య, అందే ఈశ్వరరావు, గరగపర్రాజు, తాళం అన్నపూర్ణ, వాస భ్రమరాంబ, గ్రామ ప్రజలు, తదితర నాయకులు పాల్గొన్నారు.

3,500 ఎకరాల్లో వరి పంట నీటమునక

మండల వ్యవసాయాధికారి జ్యోషిలా

ప్రజాశక్తి - నరసాపురం



తుపాను కారణంగా మండలంలోని 17 రెవెన్యూ గ్రామాల్లోని 14 గ్రామాల్లో వరి పంట 3,500 ఎకరాలు నీట మునగటం, పడిపోవడం జరిగినట్లు మండల వ్యవసాయాధికారి అడబాల జ్యోషిలా తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు ముందస్తు ప్రణాళిక ఇచ్చినట్లు తెలిపారు. అక్టోబర్ 30 నుండి నవంబర్ 3వ తేదీ వరకు పంట నష్టపరిహారం అంచనా, నమోదు జాబితాను క్షేత్ర పరిశీలన ద్వారా రెవెన్యూ, అగ్రికల్చర్ వారు నిర్వహించి మొత్తం 2,700 ఎకరాలు వరి పంట నష్టం జరిగినట్లు గుర్తించారన్నారు. ఆన్‌లైన్‌లో 2,569 మంది రైతుల జాబితాను నమోదు చేయడం జరిగిందని, మండల లెవెల్ మండల, డివిజనల్ లెవెల్ అప్రూవల్ ద్వారా జిల్లా స్థాయికి రిపోర్ట్ చేయడం జరిగిందన్నారు. సోషల్ ఆడిట్లో భాగంగా రైతుల జాబితాను (ఆర్ఎస్‌కెల్లో) మన రైతు సేవా కేంద్రాల్లోనూ ప్రదర్శించడమైందన్నారు. రైతులందరూ పంట వివరాలు ఉన్న బ్యాంకుకు లింకైన ఆధార్ సంబంధించిన వివరాలు కరెక్ట్‌గా నమోదయినవి, లేనివి చూసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జెడ్‌పి విద్యార్థిని

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్



పాలకొల్లు మండలం చింతపర్రు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న వీరి అభినందన సాఫ్ట్ బాల్ అండర్-14 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని స్కూల్ ప్రధానోపాధ్యాయులు దాసరి శ్రీనివాస్ తెలియజేశారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలంలోని బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్కూల్ అండ్ గేమ్స్ ఫెడరేషన్ వారు ఈ ఎంపికను నిర్వహించారు. ఈ ఎంపికతో అభినందన రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందని ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. ఎంపికైన అభినందనను గ్రామ సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు, ఉప సర్పంచి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

సచివాలయాల్లో వెబ్ క్యామ్ ఏర్పాటు : కలెక్టర్

భీమవరం : ఈనెల 6న నిర్వహించే కౌశలం సర్వే మాక్ టెస్ట్‌కు జిల్లాలోని అన్ని సచివాలయాల్లో వెబ్ క్యాములు ఏర్పాట్లును పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కౌశలం సర్వే అనేది ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం చేపట్టిన ఒక కార్యక్రమం అన్నారు. కౌశలం సర్వే ద్వారా జిల్లాలో గుర్తించిన 1,09,347 మందికి అర్హత పరీక్ష నిర్వహించే ముందుగా జిల్లాలోని 535 సచివాలయాల్లో ఏర్పాటుచేసిన వెబ్ క్యాముల ద్వారా సచివాలయ సిబ్బంది అయిన డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో 6వ తేదీ సాయంత్రం 4 గంటల నుండి 4:30 వరకు, సాయంత్రం 4.45 నుండి 5.15 వరకు రెండు బ్యాచ్‌లో మాక్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తొలుత వర్క్ ఫ్రం హోం సర్వే ద్వారా పదో తరగతి నుండి పీజీ వరకు చదువుకున్న 18 ఏళ్ల నుండి 50 ఏళ్ల లోపు వయసు కలిగిన వారి వివరాలను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. అనంతరం దీనిలో అర్హత కలిగిన 1,09,347 మందిని ఎంపిక చేసి కౌశలం సర్వేలో భాగంగా వివరాలను సేకరించడం జరిగిందని తెలిపారు.

8 నుంచి ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్

పాలకొల్లు : పాలకొల్లులో ఈనెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు చెరుకూరి బుద్ధావతారం రాజు మెమోరియల్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు చెప్పారు. కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌కు జాతీయ స్థాయి మంచి ర్యాంకులు ఉన్న క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. మీడియాతో సంస్థ ఆర్గనైజేషన్ కార్యదర్శి జిఎస్‌విఆర్ఎస్ఎన్.రాజు, రుద్రరాజు సత్యనారాయణ రాజు, కోశాధికారి రుద్రరాజు రమేష్ రాజు, సూరిబాబు పాల్గొన్నారు.

సోషలిజమే పరిష్కారం అంశంపై నేడు సదస్సు

ముఖ్య వక్తగా బివి.రాఘవులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిఐటియు అఖిలభారత మహాసభ సందర్భంగా ప్రపంచ పరిణామాలు సోషలిజమే పరిష్కారం అనే అంశంపై సదస్సు ఆరో తేదీ గురువారం నిర్వహించనున్నట్లు సిఐటియు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైఎస్.కనకారావు, ఎం.ఇసాక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సుకు ముఖ్య వక్తగా సిఐటియు ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బివి.రాఘవులు హాజరవుతున్నారని చెప్పారు. గురువారం ఉదయం పది గంటలకు జ్యూట్ మిల్లు సెంటర్ నుంచి బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ మీదుగా సీతారామ భారతీయ కళ్యాణ మండపం వరకు ర్యాలీ జరుగుతుందని, అనంతరం సదస్సు ప్రారంభమవుతుందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రంగాల ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో ఈ సదస్సుకు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

నూజివీడు మున్సిపల్ కమిషనర్‌గా పీరయ్య

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



నూజివీడు పురపాలక సంఘానికి నూతన కమిషనర్‌గా కొర్రపాటి వీరయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకు సెక్రటేరియట్ ముఖ్య కార్యదర్శి వ్యక్తిగత కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పటివరకు ఇక్కడ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆర్.వెంకట్రామిరెడ్డి పురపాలక శాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పీరయ్య మాట్లాడుతూ పూలపాలక సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

జంగారెడ్డిగూడెం ఎఎస్‌పిగా సుస్మితరామ్‌నాథన్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం డిఎస్‌పి కార్యాలయంలో కొత్త ఎఎస్‌పిగా ఐపిఎస్ అధికారి సుస్మితరామ్‌నాథన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం డివిజన్‌లో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, పౌరులకు వేగవంతమైన సేవల అందుబాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. పోలీసులు, ప్రజలు కలిసి పనిచేస్తే సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆమె స్పష్టం చేశారు. బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు పట్టణంలో పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరించిన సుస్మితరామ్‌నాథన్

పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కరించాలి

ఏలూరు ఆసుపత్రి సూపరిటెండెంట్‌ను కోరిన

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్, జిల్లా జెఎసి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, పోలీసులకు సంబంధించిన రూ.50 వేల లోపు మెడికల్ రియింబర్స్‌మెంట్ క్లెయిమ్స్ చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, జిల్లా జెఎసి ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్ ఏలూరు సర్వజన ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ ఎంఎస్.రాజును కోరారు. బుధవారం జెఎసి ఆధ్వర్యంలో నాయకులు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి ఉద్యోగుల పెండింగ్ బిల్లుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఎనిమిది నెలల పైబడి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులు, పెన్షనర్లకు సంబంధించిన మెడికల్ బిల్స్ సుమారు 800 పైగా పెండింగ్‌లో ఉన్నాయని, సకాలంలో బిల్లులు రాక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే పరిష్కరించాలని కోరారు. స్పందించిన సూపరింటెండెంట్ నవంబర్ నెలాఖరు నాటికి పెండింగ్‌లో ఉన్న బిల్స్ పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ కార్యదర్శి నెరుసు రామారావు, ఏలూరు తాలుకా అధ్యక్షుడు శ్రీధర్‌రాజు, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌జిఒ అసోసియేషన్, జెఎసి

ధాన్యం కొనుగోలుకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి - భీమడోలు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ్ తెలిపారు. ఆయన భీమడోలు మండలంలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కోసం అధికారులు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. వ్యవసాయ శాఖపరంగా తీసుకున్న చర్యలను జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ భాషా, భీమడోలు సహాయ సంచాలకులు రాజకుమారి, వ్యవసాయ అధికారి ఉషారాణి వారికి వివరించారు. పర్యటనలో భాగంగా సంయుక్త కలెక్టర్ గుండుగొలను గ్రామంలో వ్యవసాయ క్షేత్రానికి వెళ్లారు. అక్కడ ఇ- పంట సూపర్ చెక్ రికార్డులను పరిశీలించారు. పూళ్ల లోని రైస్‌మిల్లులో ధాన్యం కొనుగోలుకు సిద్ధం చేసిన గోనె సంచుల నాణ్యతను తనిఖీ చేశారు. కురెళ్లగూడెంలో రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.



సూపర్ చెక్ రికార్డులు పరిశీలిస్తున్న జెసి

రాష్ట్రస్థాయి పోటీలకు బుట్టాయగూడెం విద్యార్థులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం పిఎంశ్రీ హై స్కూల్ ప్లస్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సుబ్బలక్ష్మి తెలిపారు. ఈ నెల నాలుగో తేదీన ఎపిఎస్‌డబ్ల్యూఆర్ పెదవేగి పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి అండర్-14 విభాగంలో కె.చైతన్య, అండర్-17 సాఫ్ట్‌బాల్ విభాగంలో పి.రమ్య ఎంపికయ్యారని తెలిపారు. వీరు కడప, పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సుబ్బలక్ష్మి తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్.సీతారాం, తెల్లం శ్రీనివాసరావు, కె.రామచంద్రంలను పలువురు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

మెగా జాబ్‌మేళాలో 232 మంది ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవడం ద్వారా యువత తమ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి హితవు పలికారు. ఏలూరు అశోక్‌నగర్‌లోని కెపిడిటి హైస్కూల్ ఆడిటోరియంలో ఎంఎల్ఎ సహకారంతో నియోజకవర్గ యువతకు బుధవారం భారీ జాబ్ మేళా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో యువత హాజరయ్యారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జితేందర్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు దిశా నిర్దేశం చేశారు. ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ దాదాపు 19 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. దాదాపు నియోజకవర్గ పరిధిలోని 232 మంది యువత వివిధ కొలువులకు ఎంపికవ్వడం శుభపరిణామన్నారు. ఈ జాబ్ మేళాకు వచ్చిన అభ్యర్థులకు ఎంఎల్ఎ బడేటి చంటి భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి కె.ప్రవీణ్, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, మాజీ ఛైర్మన్ పూజారి నిరంజన్, టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కార్యదర్శి రెడ్డి నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటి నూజివీడులో ఐజిసి విజయవంతం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడులో ఈ నెల రెండో తేదీ నుంచి మూడో తేదీ వరకు రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ (సికింద్రాబాద్) డైరెక్టరేట్ పరిధిలో ఐడియా ఇన్నోవేషన్ ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్ విజయవంతంగా నిర్వహించారు. ఈ పోటీలను కాకినాడ గ్రూపు ఆధ్వర్యంలో 17 ఆంధ్ర బెటాలియన్, విజయవాడ క్యాంపు కమాండెంట్, లెఫ్టినెంట్ కల్నల్ అజిత్‌సింగ్ తోమర్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఆంధ్రా, తెలంగాణలో డైరెక్టరేట్ పరిధిలో మొత్తం తొమ్మిది గ్రూపుల్లో హెడ్ కోటర్స్ ఉన్నాయి. ప్రతి గ్రూపు నుంచి సాంకేతిక నైపుణ్యం కలిగిన రెండు ప్రాజెక్టులు ఎంపిక చేసి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్స్‌పో అనుభవజ్ఞులైన ఆఫీసర్లతో కలిసి నిర్వహించారు. జ్యూరీ సభ్యులుగా లెఫ్టినెంట్ కల్నల్ హెచ్.లలిత్‌బాబు, లెఫ్టినెంట్ కల్నల్ కెఎస్.పండియన్, బి.వినోద్‌బాబు బాధ్యతలు నిర్వర్తించారు. ఈ ఐజిసి పోటీలను కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్, కల్నల్ సుధాంశు దూబే పరిశీలించారు. ఈ పోటీల్లో హైదరాబాద్ గ్రూప్ క్యాడెట్లు మొదటి స్థానం, తిరుపతి గ్రూప్ రెండో స్థానం, గుంటూరు గ్రూప్ మూడో స్థానం, కాకినాడ గ్రూప్ నాలుగో స్థానం, తిరుపతి గ్రూప్ మళ్లీ ఐదో స్థానం సాధించారు. ఈ ఐదు ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ (సికింద్రాబాద్) డైరెక్టరేట్ తరపున ఆలిండియా లెవల్ ఐడియా ఇన్నోవేషన్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నాయని క్యాంప్ అడ్జుటెంట్‌గా కెప్టెన్ డాక్టర్ సిహెచ్‌ఎస్‌ఆర్.నవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమం జరగటానికి ముఖ్య భూమిక పోషించిన ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్‌కు, ఎఒ డాక్టర్ లక్ష్మణరావుకు, డీన్ ఎకడమిక్స్ డాక్టర్ చిరంజీవికి, నూజివీడు అడ్మినిస్ట్రేషన్‌కు లెఫ్టినెంట్ కల్నల్ అజిత్ సింగ్ తోమర్ తమ కృతజ్ఞతలు తెలిపారు.



ఉద్యాన పంటల అభివృద్ధికి సిడిపి ప్రణాళికలు సిద్ధం

క్లస్టర్ డెవలపమెంట్ ప్రోగ్రాం రాష్ట్ర కో ఆర్డినేటర్ విద్యాశంకర్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

క్లస్టర్ డెవలపమెంట్ ప్రోగ్రాం (సిడిపి) కింద రాష్ట్రంలో ఉద్యాన పంటల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర సిడిపి కో ఆర్డినేటర్ విద్యాశంకర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని నేషనల్ హార్టికల్చర్ మిషన్ సహకారంతో ఈ పథకం అమలవుతోందని చెప్పారు. బుధవారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉద్యానశాఖాధికారులతో, రైతులతో కలిసి సిడిపి అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశంకర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే పలు ఉద్యాన పంటలను క్లస్టర్ ప్రణాళిక కింద ప్రాథమికంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. పథకం అమలులో భాగంగా 20 శాతం రైతుల వాటా, 20 శాతం బ్యాంకు రుణం, మిగిలిన 40 శాతం కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ రూపంలో లభిస్తుందని వివరించారు. విత్తనం, మొక్కలు, సాగు విధానాలు, ఎగుమతులు, ప్రాసెసింగ్, బ్రాండింగ్, లాజిస్టిక్స్ వంటి అంశాల్లో రైతులు, సంస్థలు భాగస్వామ్యం వహించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హార్టికల్చర్ బోర్డు మెంబర్ ప్రదీప్, మైక్రో ఇరిగేషన్ పీడీ రామ్మోహన్, భాషా, సైంటిస్ట్ డాక్టర్ సుశీల, లీడ్ బ్యాంకు మేనేజర్ నీలాద్రి, నాబార్డ్ డిడిఎం అనిల్‌ఖాన్, ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ జోనల్ మేనేజర్ సాయి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు కృషి

చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

పత్తి పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు రాష్ట్రంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. మండలంలో ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయం వద్ద 2025-26 సంవత్సరానికి సంబంధించిన పత్తి రైతుల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26వ సీజన్‌లో రైతులు పండించిన ప్రతి పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు, సుబ్బారావు, అగ్రికల్చర్ ఎడి ఎస్‌కె.మహరాజ్ భాషా, తదితరులు పాల్గొన్నారు.



వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్స్ పంపిణీ



ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం 24 మంది వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్స్‌ను రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన వికలాంగులకు ఉపకరణాలు, పింఛన్లు అందిస్తున్నామని, ఇంకా అర్హులు ఉంటే సమీప ఎంపిడిఒ కార్యాలయంలో లేదా సచివాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని చెప్పారు.

ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా పోలారి, వెంకటేశ్వర్లు

రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవి.రమణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులుగా కె.పోలారి, ప్రధాన కార్యదర్శిగా ఎం.వెంకటేశ్వర్లు ఎంపికైనట్లు ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవి.రమణ తెలిపారు. స్థానిక ఐఎఫ్‌టియు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర రాజకీయ తరగతులు ఏలూరులో నవంబర్ ఒకటి నుంచి మూడో తేదీ వరకు జరిగాయని, నాలుగో తేదీన రాష్ట్ర ప్రతినిధుల నిర్మాణ సభ(జనరల్ కౌన్సిల్) జయప్రదంగా జరిగిందనితెలిపారు. ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగిన జనరల్ కౌన్సిల్ ముగింపులో రాష్ట్ర నాయకత్వంలో మార్పులు, చేర్పులు జరిగాయని తెలిపారు.

రైతు సమస్యల పరిష్కారానికి 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రైతుల సమస్యలు తీర్చడానికే పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.గంగాధర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తాటియాకులగూడెం, మడకం వారిగూడెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులు పంటల్లో రసాయన ఎరువులను తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడాలని రైతులకు సూచించారు. అదే విధంగా త్వరలో మండలంలోని ములగలంపల్లి సొసైటీ, కామయ్యపాలెం డిసిఎంఎస్, జీలుగుమిల్లి సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు రోజా, ఉషా, ఏపిసిఎన్‌ఎఫ్ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

9న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఎ) ఆధ్వర్యంలో విజయ హాస్పటల్స్ రితేష్ హార్ట్ కేర్ ఏలూరు వారి సహకారంతో గుండె, నేత్ర, జనరల్ వైద్య విభాగాల్లో ఉచిత మెగా వైద్య శిబిరం ఈ నెల తొమ్మిదో తేదీన ఆదివారం వైఎంహెచ్ఎ హాలులో నిర్వహించనున్నట్లు మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కెవి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత మెగా వైద్య శిబిరంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు పి.రితేష్ ఇసిజి, 2డి ఎకో వంటి గుండె పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

'వైద్య కళాశాలల ప్రయివేటీకరణ తగదు'

ప్రజాశక్తి - మండవల్లి

పేద, మధ్యతరగతి విద్యార్థులు డాక్టర్లు కాకూడదనే లక్ష్యంతోనే కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రయివేట్ పరం చేస్తుందని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో గన్నవరంలో బుధవారం నిర్వహించిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు చేబోయిన వీర్రాజు, ఎస్‌సి సెల్ విభాగ కార్యదర్శి గుమ్మడి వెంకటేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షులు బేతపూడి ఏసేబురాజు, బిసి సెల్ అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ల యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.15,54,531

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని శింగరాయపాలెం-చేవూరిపాలెం సెంటర్లో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో హుండీలను బుధవారం లెక్కించారు. 134 రోజులకు రూ.13,79,953, అన్నదానానికి రూ.1,74,578 మొత్తం రూ.15,54,531లు ఆదాయంగా వచ్చింది. అదే విధంగా వెండి 750 గ్రాములు, బంగారం 2.500 మిల్లి గ్రాములు వచ్చిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్, కార్య నిర్వహణ అధికారిణి ఆర్.గంగా శ్రీదేవి తెలిపారు.

రైతులకు రుణాలివ్వాలి

చింతలపూడి : డి నమూనా పట్టా తీసుకున్న రుణాలన్నీ కూడా వన్ టైం సెటిల్‌మెంట్ చేసి మళ్లీ డి నమూనా పట్టాలపై రుణాలు ఇచ్చే సౌకర్యాన్ని రైతులకు కల్పించాలని ఎర్రంపల్లి సొసైటీ ఛైర్మన్ తాళ్లూరి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. డిసిసిబి సెంట్రల్ బ్యాంక్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డి నమూనా పట్టాపై రుణ సౌకర్యం కల్పించాలని గతంలో నందమూరి తారక రామారావు ప్రవేశపెట్టిన పథకాన్ని 2005లో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆపారని తెలిపారు. దీంతో రుణాలు కడితే మళ్లీ లోన్ ఇవ్వరని రైతులు రుణం కట్టకపోవడంతో బకాయిలు బాగా పెరిగిపోయాయన్నారు. డి నమూనా పట్టా తీసుకున్న రుణాలన్నీ కూడా వన్ టైం సెటిల్‌మెంట్ చేస్తే అవకాశం ఇస్తే రైతులకు ఉపయోగపడుతుందన్నారు.

లోకేష్‌ను కలిసిన పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ రాష్ట్ర ఐటి, హయ్యర్ ఎడ్యుకేషన్ శాఖ మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న ప్రధాన సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఛైర్‌పర్సన్ మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, జిల్లా బిసి నాయకుడు ఘంటా ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల మండలంలోని వివిధ గ్రామాల్లో పల్లె పండుగ గ్రామాలాభివృద్ధిలో భాగంగా గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు సుమారు రూ.ఎనిమిది కోట్ల విలువైన పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. మండలంలోని బుట్టాయగూడెం గ్రామంలో రూ.1.85 కోట్లతో తారు రోడ్డు, సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు, పి.కన్నాపురం గ్రామంలో రూ.రెండు కోట్లతో బిటి రోడ్డు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, పంగిడిగూడెం గ్రామంలో రూ.1.85 కోట్లతో బిటి రోడ్డు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, తిరుమలంపాలెం గ్రామంలో రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, గొల్లగూడెం గ్రామంలో రూ.45 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులతో పాటు పలు అభివృద్ధి పనులకు ఎంఎల్‌ఎ శంకుస్థాపన చేశారు.

మత్స్యకార కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - పోలవరం

మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన మత్స్యకారుల కుటుంబాలకు బుధవారం తహశీల్దార్ బి.సాయిరాజు ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. మండలంలో 364 కుటుంబాలకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఒక్కొక్క కుటుంబానికి 50 కిలోలు బియ్యం, ఒక కిలో కందిపప్పు, ఒక లీటరు పామాయిల్ నూనె, ఒక కిలో ఉల్లిపాయలు, ఒక కిలో బంగాళదుంపలు పంపిణీ చేసినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిటి, విఆర్‌ఒ గాంధీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

నూతన జాతీయ రహదారి (365 బిబి) ఏర్పాటు లో విద్యుత్ స్తంభాల మార్పు పనుల దృష్ట్యా జీలుగుమిల్లి సబ్ స్టేషన్ పరిధిలోని జీలుగుమిల్లి టౌన్ ఫీడర్, తాటియకులగూడెం ఫీడర్‌లో గురువారం ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. వినియోగదారులు సహకరించగలరని కోరారు.